ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 28 నవంబరు 2024 | 5

శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి


శృంగేరీ జగద్గురు విధుశేఖర భారతీ మహా స్వామి



కోటి దీపోత్సవం కార్తీక మాసం సందర్భంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున సరస్వతీఘాట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన కోటి దీపోత్సవం - 7లో



ర్యాలీ.. రాజమహేంద్రవరంలో బుధవారం రాత్రి నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త్ భారత్' కొవ్వొత్తుల ర్యాలీ. చిత్రంలో పీజేడీ గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి తదితరులు - 6లో



అభిభాషణ రాజమహేంద్రవరంలోని త్యాగరాజ నారాయణదాస సేవా సమితి భవనంలో జరిగిన పూజా కార్యక్రమంలో హారతి దృశ్యం - 6లో



అనపర్తి ఏరియా ఆసుపత్రి

కాయకల్ప ప్రోగ్రాం ద్వారా

రాష్ట్రంలోనే ఉత్తమ తృతీయ ఏరియా ఆసుపత్రిగా అనపర్తి

ఆసుపత్రి అభివృద్ధికి రూ. 5 లక్షల నజరానా


అనపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, ఆసుపత్రి పనితీరు, శుభ్రత పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి ఉత్తమ ఆసుపత్రులుగా ఎంపికైన ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం నజరానా ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఒక బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేసి నివేదికను సమర్పించింది. దీనిలో భాగంగా ఏరియా ఆసుపత్రుల్లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఆసుపత్రుల ఎంపికలో అనపర్తి ఏరియా ఆసుపత్రి తృతీయ స్థానం దక్కించుకుని రూ.5 లక్షల నజరానాను సాధించింది. ఏరియా ఆసుపత్రుల్లో పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి 97 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించి రూ.10 లక్షల నజరానాను సొంతం చేసుకుంది. ఏలూరు జిల్లాలోని నూజివీడు ఏరియా ఆసుపత్రి 96.43 పాయింట్లతో ద్వితీయ స్థానం సాధించి రూ.7.5 లక్షల నజరానాను సొంతం చేసుకోగా అనపర్తి ఏరియా ఆసుపత్రి 95.86 పాయింట్లు సాధించి తృతీయ స్థానం సాధించి రూ.5 లక్షల నజరానాను సాధించింది. నజరానాగా వచ్చిన నగదుతో ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఏర్పాటు చేస్తారు.

తృతీయ స్థానం సాధించడం ఆనందంగా ఉంది



కాయకల్ప పథకంలో భాగంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను గుర్తించి నజరానాలు అందించే కార్యక్రమంలో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తృతీయ స్థానం లభించడం ఆనందంగా ఉంది. నజరానాగా వచ్చిన రూ.5 లక్షలతో ఆసుపత్రిలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు వెచ్చిస్తాం.

- డాక్టర్ రామగురెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, అనపర్తి



నేర సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

ప్రజల్లో విశ్వసనీయత పెంపొందాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహిరంగ మద్యపానం, తాగి వాహనాలు నడపడంపై తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఇష్టానుసారం డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, డయల్ 112కి కాల్ వస్తే తక్షణమే స్పందించి సాధ్యమైనంత త్వరగా బాధితుల వద్దకు చేరుకోవాలని చెప్పారు. సారా, గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అడిషనల్ ఎస్పీలు ఏవీ సుబ్బరాజు, ఎన్‌బీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

- తీరు మారని కొందరు
- స్టేషన్లలో వైసీపీ వాసనే
- ఆ నేతలకు తెరచాటుగా సహాయం
- పోలీసు బదిలీల్లో మతలబే కారణం
- బదిలీలను పునఃసమీక్షించాలని చర్చ
- వారంలో పంపాలని తాజాగా ఉత్తర్వులిచ్చిన ఐజీ

ఇంకా.. పంకా పోలీసే..



'బి క్లియర్. నేను 95 సీఎం అని చెప్పాను. మీకు ఇంకా అర్థం కాలేదు. మర్యాదగ చెబితే మీకు అర్థం కావడం లేదు. అందుకే ఇప్పుడు యాక్షన్‌లోకి వస్తున్నాను. మర్యాద అయిపోయింది. ఇప్పుడు యాక్షన్ కూడా ఉంటుంది. బీ కేర్‌ఫుల్'.. ఓ జిల్లా స్థాయి అధికారికి సీఎం చంద్రబాబు రెండు నెలల కిందట బహిరంగ సభలో ఘాటుగా ఇచ్చిన స్ట్రాంగ్ వార్నింగ్. ఆ ఘటన జరిగి రెండు నెలలు దాటింది. అయినా కొందరు అధికారుల్లో 'గాలి' తీరు మారడం లేదు. ముఖ్యంగా పోలీసుల్లో కొందరు పైకి అధికార పార్టీకి విధేయులుగా నటిస్తూ లోపాయికారిగా వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారనే వాదన బలంగా వినవస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులనే టార్గెట్‌గా చేసుకున్న జగన్.. పోలీసులను వారిపైకి వదిలారు. వైసీపీ పెద్దల వద్ద మార్కులు వేయించుకోడానికి పోలీసులు ఇష్టానుసారం ప్రవర్తించారు. సొంత చట్టాలకు తెరలేపారు. నోరు మెదిపితే కేసు.. కాలు కదిపితే కోటింగ్.. అనే దందాను రక్తికట్టించారు. అయితే.. కూటమి ప్రభుత్వానికి జనం అధికారం కట్టబెట్టినా కొందరు పోలీసులు మాత్రం ఇంకా వైసీపీ పంచన పని చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని చాలా పోలీస్ స్టేషన్లలో ఇంకా వైసీపీ వాసనే వస్తోంది. జగన్ జమానాలో పోలీసులను రాజకీయ కక్ష సాధింపునకు విపరీతంగా వాడుకొన్న మాట జగమెరిగిన సత్యం. ఆ ఐదేళ్లలో ఠాణాలు సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మారిపోయాయి. పాలకులే గడ్డి కరుస్తుండడం.. అక్రమాలకు వత్తాసు పలకడంతో అధికారుల అమ్యామ్యాల పని సులభంగా అయిపోయేది. వైసీపీ పాలన సమయంలో స్టేషనుకు వెళ్లాలంటే పేదోడికి దడ పుట్టేది. ఎవరికి తమ గోడు వినిపించాలో తెలియక కుమిలిపోయేవాళ్లు. వైసీపీ నేత వద్దకు వెళ్లి కాళ్లావేళ్లా పడితేనే అతడు దయ చూపి పోలీస్ స్టేషనుకు ఫోన్ చేస్తే అప్పుడు ఫిర్యాదు తీసుకునే దారుణమైన పద్ధతి నడిచేది. స్టేషనుకు బాధ్యులుగా ఉండే సీఐ, ఎస్‌ఐలను కావాల్సిన వాళ్లను సీట్లలో కూర్చోబెట్టుకోవడంతో దందాలకు అడ్డూఅదుపూ ఉండేది కాదు. వైసీపీ దుండగులు ఇళ్లల్లోకి వెళ్లి దాడి చేసినా వాళ్లపై కాకుండా బాధితులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొందరు అధికారులు దందాల పంథా మార్చుకోవడం లేదు. అప్పట్లో ఎలాగైతే దందాలు సాగించేవారో ఇప్పుడూ అదే నడుస్తుండడమే వాటికి కారణంగా వినవస్తోంది. వైసీపీ హయాంలో నీలం కండువా నీడలో దాష్టీకాలకు తమ వంతు సహాయం చేసిన పోలీసులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కీలకమైన పోస్టింగులు దక్కించుకున్నారు. ఈ బదిలీల్లో భారీగా డబ్బులు చేతులు మారాయనే విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు జిల్లాలోని కీలకమైన పోలీస్ స్టేషన్ల సీటు దక్కించుకోడానికి సుమారు రూ.15 లక్షల వరకూ రేటు పలికిందని చెబుతున్నారు. అయితే.. ఇక్కడే వైసీపీ తెరచాటు కుట్ర ప్రదర్శించింది. తమకు అనుకూలంగా ఉన్న అధికారులకు వైసీపీ నాయకులే డబ్బులు సమకూర్చి వాళ్ల అనుకున్న సీట్లోకి తెచ్చుకున్నారు. దీంతో తెరపైన కూటమికి విధేయత ప్రదర్శిస్తున్నా.. వైసీపీకి తెరచాటున 'పని' చేసిపెడుతున్నారు. వైసీపీ నాయకులు ఇచ్చే సమాచారంతో టీడీపీ నాయకులను కేసుల్లో ఇరికిస్తున్నారు. గతంలో వైసీపీ నేతలు ఏరికోరి తెచ్చుకున్న అధికారులకు కూటమి ప్రభుత్వంలో కూడా కీలకమైన స్థానాలు దక్కాయి. సీఐలు, ఎస్‌ఐల బదిలీలపై కూటమి పెద్దలు పెద్దగా దృష్టి పెట్టకపోవడంతోనే పరిస్థితి ఇలా మారిందని అటు కూటమి కేడర్‌లోను, ఇటు పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఉదాహరణకు జిల్లాలోని వైసీపీకి పూర్తిగా కొమ్ముకాసే అధికారిగా పేరు బడిన ఓ సీఐ మళ్లీ కీలకమైన స్టేషన్ దక్కించుకున్నారు. మరో ఇలా పలువురు సీఐలు 'కావాల్సిన' సీటు సంపాదించారు. సాధారణంగా గతంలో పనిచేసిన పోలీస్ స్టేషనుకు పోస్టింగ్ ఇవ్వడం జరగదు. కానీ కాసులతో ఆ పనీ జరిగిపోయింది. దీంతో గతంలో వైసీపీ నాయకులు మొదలు పెట్టిన పేకాట బోర్డులు, కోడి పందేలు, బెట్టింగులు వంటి జూదక్రీడలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గంజాయి అమ్మకాలూ కొనసాగుతుండడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.





శ్రీకాంత్ విడుదల సందర్భంగా జైలు వద్ద హల్‌చల్.. ప్రభుత్వ వాహనం అని స్టిక్కరింగ్ ఉన్న వాహనంలో శ్రీకాంత్‌ని తీసుకెళ్తున్న విశ్వరూప్ (ఫైల్‌ఫొటో)

● ఇదిగో తాజా ఘటన

2022 జూన్ 6న జరిగిన దళిత యువకుడు, వలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కొడుకు శ్రీకాంత్‌పై కేసు నమోదైనా రెండేళ్లపాటు పోలీసులకు అరెస్టు చేయాలనే ఆలోచన కూడా రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. దీంతో శ్రీకాంత్‌ని ఏపీ పోలీసులు తమిళనాడులో అరెస్టు చేశారు. తర్వాత రాష్ట్రానికి తరలించారు. కోర్టు రిమాండు విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అతడికి మంగళవారం(26న) కోర్టు బెయిల్ మంజూరు చేసినా తగిన పత్రాలు జైలుకు సమర్పించడం, తదుపరి ప్రక్రియకు సమయం దాటిపోవడంతో 27న (బుధవారం) సాయంత్రం 6 గంటలకు విడుదల చేశారు. కొడుకును తీసుకెళ్లడానికి విశ్వరూప్ జైలు వద్దకు వచ్చారు. సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు గుమిగూడారు. పెద్ద పెద్ద కేకలు వేస్తూ హల్‌చల్ సృష్టించారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగింది. అయినా పోలీసులు మిన్నకుండిపోయారు. శ్రీకాంత్‌ని విశ్వరూప్ 'ప్రభుత్వ వాహనం' అని స్టిక్కరింగ్ చేసి ఉన్న ఇన్నోవాలో తీసుకెళ్లినా వారించలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తన డ్రైవరును చంపిన కేసులో నిందితుడు, ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సమయంలోనూ పెద్ద ర్యాలీ నిర్వహించారు. అప్పుడు జగన్ జమానా కాబట్టి పోలీసులూ తమ వంతు సహకారం అందించారు. తర్వాత టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసు (ప్రస్తుత రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే)ను అక్రమ లావాదేవీలంటూ అరెస్టు చేసి జైలుకు పంపారు. వారికి బెయిల్ వచ్చి విడుదలైన సమయంలో టీడీపీ శ్రేణులు జైలు వద్దకు చేరుకోగా పోలీసులు రకరకాల 'రూల్స్'తో ఇబ్బంది పెట్టారు. చివరికి ర్యాలీకి కూడా అనుమతి లేదంటూ అప్పటి డీఎస్పీ విజయ్‌పాల్ (ఈయనపై వైసీపీ డీఎస్పీ అనే ఆరోపణలు బలంగా ఉన్నాయి) నోటీసు ఇచ్చి మరీ అడ్డుకున్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో ఒక వైసీపీ నాయకుడి కొడుకు జైలు నుంచి బెయిల్‌పై విడుదలైతే హల్‌చల్‌ని ఏమాత్రమూ అడ్డుకోలేదంటే.. వైసీపీ పోలీసింగ్ నడుస్తుందనడానికి ఇంతకంటే తాజా ఉదాహరణ ఉండదేమోననే విమర్శలు వస్తున్నాయి. జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ పోలీసుల బదిలీలపై పునఃసమీక్ష చేసి మార్పులు చేస్తేగానీ వైసీపీ వాసన పోదనే వాదన కూటమి వర్గాల నుంచి వినవస్తోంది. నిజాయితీ, నిబద్ధతకు పెద్దపీట వేసే ఉన్నతాధికారిగా పేరున్న ఐజీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

● అప్పుడు పట్టించుకోలేదు

వైసీపీ హయాంలో దాష్టీకాలపై ఎంత గట్టిగా మొత్తుకున్నా అటు జగన్ ప్రభుత్వం, ఇటు పోలీసులు వినబడనట్టు నటించేవారు. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినా ఫలితం ఉండేది కాదు. ఈ క్రమంలో.. జిల్లాలోని శాంతి భద్రతలు అదుపు తప్పడంపై 'అశాంతి అభద్రత' అనే శీర్షికతో గత ఏడాది డిసెంబరు 2న ఓ కథనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఐజీ అశోక్ కుమార్ అదే నెల 4న ఎస్పీని ఆదేశించారు. కానీ యథావిధిగా దానిని పట్టించుకోలేదు. అయితే ఆ విచారణ రిపోర్టును వారంలో పంపించాలని, ఈ విషయంపై ఎస్పీ స్వయంగా చొరవ చూపాలని ఆదేశిస్తూ ఈనెల 3న బ్లాక్ రిమైండర్ పేరుతో ఐజీ ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వాస్తవాలపై ఎంత అలసత్వం ప్రదర్శించేవారో ఈ ఘటన రుజువు చేస్తోంది.




ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరగాలి

- మెరుగైన వైద్యంతో రోగుల నమ్మకాన్ని పెంచాలి
- లక్ష్యంలో వెనుకబడిన పీహెచ్‌సీలకు షోకాజ్ నోటీసులు
- వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డెలివరీలన్నీ ప్రభుత్వాసుపత్రుల్లోనే జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడిన పీహెచ్‌సీలను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంతి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, భవన నిర్మాణాలు, సదరం సర్టిఫికెట్లు జారీ, ఎఫ్ఆర్ఎస్ హాజరు, తదితర అంశాలపై మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచాలని, ప్రభుత్వాసుపత్రి పట్ల మరింత గౌరవం పెంచే విధంగా వైద్యులు పనిచేయాలన్నారు. స్నేహపూర్వకమైన వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. ప్రాథమిక, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, ల్యాబ్ టెస్టులు, ఐపీ సేవల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే ప్రగతిపై సమీక్షించారు. ప్రతి నెలా జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమం కింద గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్యసేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో నార్మల్ డెలివరీల శాతాన్ని పెంచే విధంగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి వైద్యాధికారి వరకూ ఎఫ్ఆర్ఎస్ హాజరు కచ్చితంగా అమలుచేయాలన్నారు. ఆసుపత్రులకు కావాల్సిన వైద్యపరికరాలు, ఇతర ఎక్విప్‌మెంట్లను హాస్పటల్ అభివృద్ధి సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి పాల్గొన్నారు.



కాటన్ బ్యారేజీ

ఇరిగేషన్ పరిరక్షణపైనే గురి

శాసనసభ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి చర్చ.. స్పందించిన చంద్రబాబు



నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈసారి మన ఎమ్మెల్యేలంతా వివిధ కీలక ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ లేవనెత్తారు. ఒకరితో ఒకరు పోటీపడి స్థానిక సమస్యలు ప్రభుత్వ దృష్టి పడేలా అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయాన్ని బాగా వినియోగించుకున్నారు. ఈ సందర్భంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్యేలు ప్రధాన చర్చనీయాంశం చేశారు. అందులో గోదావరి జలాలపై ఆధారపడిన అన్నదాతల ఇబ్బందులను సభలో చర్చించారు. ముఖ్యంగా శాసనసభ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇరిగేషన్ అంశాలపై జరిగిన చర్చల్లో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కాలువల్లో పూడికతీత పనులు కూడా చేపట్టకపోవడంతో గుర్రపుడెక్కతో కాలువలు పూడుకుపోయాయని అన్నారు. కనీసం లాకుల షెట్టర్లకు గ్రీజులు కూడా పెట్టే పరిస్థితి కూడా లేదన్నారు. అలాగే ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేశారని సభ దృష్టికి తీసుకువచ్చారు. చాగల్నాడు, వెంకటాపురం, పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసి రైతు ప్రయోజనాల పరిరక్షణలో వైసీపీ ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందినట్టు నల్లమిల్లి ఆరోపించారు. ఇదే సందర్భంలో రెండు దశాబ్దాల కిందట గోదావరి కాలువలపై నిర్మాణాలు చేపట్టిన అనేక వంతెనలు అప్రోచ్ రోడ్డులు లేక నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని పూర్తి చేయడం ద్వారా ప్రజలకు ఉపయోగపడతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. మరో రెండు పర్యాయాలు ప్రశ్నోత్తరాల సమయంలో నల్లమిల్లికి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని గోదావరి డెల్టా కాలువల ఆధునికీకరణ అంశాలపై మాట్లాడారు. గోదావరి డెల్టా సిస్టంలో ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో మొత్తం 3670.54 కిలోమీటర్ల మేర పూడిక తీతలు చేపట్టాల్సి ఉందని, అదేవిధంగా ధవళేశ్వరం బ్యారేజీ గత ప్రభుత్వం నిర్వహణలోపం వల్ల ప్రమాదంలో పడిందని.. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు ఏడు కిలోమీటర్ల పొడవునా 175 ఫ్లడ్ గేట్లు, 22 స్లూయిజ్‌లు 197 ఉన్నాయని, వీటిలో 117 గేట్లు మార్చాలని 2022లో వరల్డ్ బ్యాంక్, సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. దీనికి సీఎం చంద్రబాబు స్పందిస్తూ గోదావరి డెల్టా ఆధునీకరించే ఆలోచన ఉందని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు ఆత్మహత్యాయత్నం - 7లో

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు - 7లో



ఒకప్పుడు ఐటీఐలో చదివారంటే ఉద్యోగం గ్యారంటీ. అప్పట్లో ఏ కోర్సుకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటే అంతా అదే ట్రేడ్‌లో చేరిపోయేంత క్రేజ్ నడిచేది. టెక్నాలజీకి పర్యాయపదం ఐటీఐ. ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చాక ఆ ప్రభ కొంత తగ్గింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు విస్తృతంగా పెరగడం, ఫీజు రీయంబర్స్‌మెంటు ద్వారా పేదవర్గాల వారూ చదువుకునే అవకాశం కలగడంతో ఐటీఐ దాదాపు కనుమరుగైపోయింది. కానీ కొవిడ్ తర్వాత పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చదివేవారు మళ్లీ పెరిగారు. ప్రాక్టికల్ నాలెడ్జికి పెద్దపీట వేసే ఐటీఐకి ఆదరణ పెరిగింది. స్వల్ప వ్యవధిలో ఉపాధి అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కని దారి. అంతేకాదు.. ఇంకా చదవాలంటే అటు పాలిటెక్నిక్‌లో చేరి అనంతరం ఇంజనీరింగ్ పూర్తిచేసే బ్రిడ్జి కోర్సు సైతం ఉండడం విశేషం.

ఐటీఐ.. ఉపాధికి షార్ట్‌కట్!



(ఆంధ్రజ్యోతి- కాకినాడ కార్పొరేషన్)

పారిశ్రామిక వృద్ధితో నిపుణులకు పెరుగుతున్న అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అందుబాటులో వేలాది సీట్లు

ఐటీఐల్లో మొత్తం 13 ట్రేడ్లు

స్కిల్ హబ్ ద్వారా ఎన్నో ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్

పది తర్వాత కేవలం రెండేళ్ల కోర్సు పూర్తిచేస్తే ఉద్యోగం పొందే అవకాశం ఐటీఐలో మాత్రమే ఉంది. ఈ కోర్సు పూర్తి చేసి అప్రెంటీస్ చేస్తుండగానే జీవితంలో స్థిరపడడానికి వీలుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక రంగం వేగవంతంగా వృద్ధి చెందుతుండడంతో ఐటీఐ చేసిన వారికి సులువుగా జీవనోపాధి పొందవచ్చు. పూర్వం ఐటీఐ చదివారంటే ఉపాధి అవకాశాలు పొందడం గ్యారంటీ అనే పరిస్థితి ఉండేది. ఇంజనీరింగ్ కాలేజీలు అందరికీ అందుబాటులోకి రావడంతో కొన్నేళ్లపాటు అందరూ అటు వైపే వెళ్లారు. కొవిడ్ తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో అనేక మార్పులొచ్చాయి. ప్రాథమిక స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం పొందిన వారికి కూడా ఏదొక ఉపాధి దొరుకుతోంది. దానికి అనుగుణంగా పారిశ్రామిక విస్తరణ మరిన్ని అవకాశాలను కల్పిస్తోంది. నిర్మాణ రంగం మరెన్నో చిరుద్యోగాలను సృష్టిస్తోంది. దాంతో స్వల్ప వ్యవధిలో ఉపాధి పొందడానికి ఐటీఐలు దోహదం చేస్తున్నాయి. ఐటీ రంగం కుదేలు కావడంతో టెక్నికల్ కోర్సుల వైపు విద్యార్థులు మళ్లడానికి మరో కారణమైంది. పది తర్వాత ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటీస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందడానికి మార్గం ఉంటుంది. విద్యుత్, రైల్వే రక్షణ, పలు ప్రభుత్వ ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడ్స్‌లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహంలేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్ ఏర్పాటుచేసి విద్యార్థులకు నైపుణ్యాంశాలపై శిక్షణ ఇస్తోంది. ఒకవేళ ఐటీఐ పూర్తి చేసిన వారు ఇంకా చదవాలనుకుంటే పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరం ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో కోర్సులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడలో అతి పెద్ద ఐటీఐ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఉంది. ఇది ప్రస్తుత కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు ఉమ్మడిగా కొనసాగుతోంది. కాకినాడ జిల్లాలో మరొక ప్రభుత్వ ఐటీఐ ఉంది. మొత్తం కాకినాడ, జగ్గం పేట ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఉంది. ఇవికాకుండా ప్రైవేటు ఐటీఐలు ఒక్కో జిల్లాలో డజను వరకు ఉండి.. వేలాది సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉంచాయి. ఆయా ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరాలనుకునే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. ఇందులో విద్యార్థులతోపాటు విద్యార్థినులకు కూడా కోర్సులు ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలన పూర్తైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు.

ఉపాధికి ఢోకా లేదు..

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తిచేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశముంది. ఐటీఐ పూర్తిచేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశముంది. పాలిటెక్నిక్ పూర్తి చేసి బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపరుచుకోవచ్చు. ఇలా పలువురు విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి బాగా స్థిరపడుతున్నారు.

ఈ ఏడాది 338 మందికి ప్లేస్‌మెంట్స్

ఇక కాకినాడ ప్రభుత్వ ఐటీఐకి సంబంధించి ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల్లో 487 మందికి ఈఏడాది క్యాంపస్ ఇంటర్వ్యూలు ద్వారా ప్రముఖ కంపెనీలైన ఎల్అండ్‌టీ, ఏపీ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఐటీసీ లిమిటెడ్, బ్లువాసన్, ఎలైడ్ సర్వీసెస్, న్యూకాన్, ఏరోస్పేస్, వోలోమాన్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీల్లో 338 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మిగిలిన వారికి త్వరలోనే ప్లేస్‌మెంట్ అవకాశాలు ఏర్పాటుచేయనున్నారు. వందశాతం ప్లేస్‌మెంట్ పూర్తవ్వనుంది.

100 శాతం ప్లేస్‌మెంట్ దిశగా..




ఉద్యోగం సంపాదించి స్థిరపడాలనుకునే వారి కి ఐటీఐ కోర్సులు ఎంతో ఉపయోగపడతాయి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరుకావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొం దిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి. విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్ కల్పించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం.

- ఎంవీజీ వర్మ, కాకినాడ గవర్నమెంటు ఐటీఐ ప్రిన్సిపల్, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్





దివంగత పొత్తూరి చంద్రరాజు (మేడ చంద్రరాజు)



దివంగత పొత్తూరి సత్యనారాయణరాజు

గురువులకు నెలవు!

చదువు జీవితానికి మార్గదర్శి. సంస్కారానికి దిక్సూచి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ చక్కని రహదారి. ఒక కుటుంబంలో చదువుకున్న వారుంటే ఆ వంశవృక్షం ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతుంది. ఉన్నత శిఖరాలను అందుకుంటుంది. ఇది ఒక కుటుంబ విజయం కాదు.. ఒక ఊరి విజయం.. ఊరంతా టీచర్లు కావడానికి ఒకనాడు పడిన బీజం.. ఆ సంగతేంటో చదవండి...

(ఆంధ్రజ్యోతి-ముమ్మిడివరం)

అదొక చిన్న గ్రామం.. అయితే ఆ గ్రామంలో గడపగడపకొక టీచరు ఉండడం విశేషం. ఎందరో విద్యావేత్తలను, మేధావులను తీర్చిదిద్దిన ఘనత ఆ గ్రామానికి ఉంది. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామం ఉపాధ్యాయులకు నెలవు. గ్రామ జనాభా 1561 కాగా 652 కుటుంబాలు ఉన్న ఆ గ్రామంలో వందమందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారంటే విశేషమే కదా మరి. వీరిలో 60 మంది కాలంచేయగా మరో 20 మంది విశ్రాంత ఉపాధ్యాయులుగా ఉన్నారు. ప్రస్తుతం వివిధ గ్రామాల్లో 25 మంది వరకు నేడు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరిలో సగంమంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరు కాకుండా ప్రైవేటు పాఠశాలల్లో 15 మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరో 15 మంది ఎన్ఐఆర్‌లు, తెలంగాణ రాష్ట్రంలో 15 మంది ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి పొందుతుండగా, రక్షణ, పోలీసుశాఖ, ఆర్టీసీ, విద్యుత్, తపాలా శాఖ, టెలిఫోన్ శాఖ, ఆరోగ్య, పంచాయతీరాజ్, సబ్ రిజిస్ట్రార్, కోఆపరేటివ్ బ్యాంకుల్లో ఇంకో 25 మంది వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1917లో గ్రామంలో పొత్తూరి చంద్రరావు (మేడచంద్రరాజు) ఆధ్వర్యంలోను బాలుర ఎయిడెడ్ పాఠశాల, పొత్తూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బాలికల ఎయిడెడ్ పాఠశాల స్థాపించి ఉపాధ్యాయులను నియమించి ఎంతోమందికి విద్యాబోధన చేశారు. 1950లో అదే గ్రామానికి చెందిన వీపూరి కృష్ణంరాజు ఐ.పోలవరంలో ఒక ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటుచేసి చినకొత్తలంక నుంచి కాలినడకన సుమారు ఆరు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి విద్యాబోధన సాగించేవారు. ఆనాటి నుంచి నేటి వరకు చినకొత్తలంక గ్రామం ఉపాధ్యాయులకు పుట్టినిల్లుగా ఉంది. ప్రతీ కుటుంబం నుంచి ఒక ఉపాధ్యాయుడు డీఎస్సీలో ఎంపికకావడంతో ఆ గ్రామం ఉపాధ్యాయుల గ్రామంగా పేరొందింది. కొంతమంది డీఎస్సీలో సెలక్ట్ కాగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొంతమంది ప్రైవేటు విద్యాసంస్థలు ఏర్పాటుచేసి విద్యాబోధన సాగిస్తున్నారు. గ్రామంలో విద్యావంతులు ఎక్కువగా ఉండడంతో ఆ గ్రామం అభివృద్ధిలో ముందుంది. పాఠశాలకు పక్కా భవనం, అంగన్‌వాడీ భవనం, గ్రంథాలయ భవనం, కమ్యూనిటీ భవనం, మహిళా మండలి భవనం వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి.



వారి స్ఫూర్తితోనే ఉపాధ్యాయ వృత్తి

గ్రామంలో పొత్తూరి చంద్రరాజు, పొత్తూరి సత్యనారాయణరాజు, వీపూరి కృష్ణంరాజుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో స్వీకరించా. మా కుటుంబంలో పెదన్నాన్న, చిన్నాన్న, బావలు ఉపాధ్యాయులుగా పనిచేశారు. అందువల్లే నేను, మా పిల్లలు ఉపాధ్యాయ వృత్తిని ఎన్నుకున్నాం. ఎంతోమందికి విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన తృప్తి ఉంది. ఉపాధ్యాయ సంఘంలో చురుకైన పాత్ర పోషించి పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశా. ప్రస్తుతం విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా.

- పీవీవీ సత్యనారాయణరాజు, రిటైర్డ్ ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి



అభివృద్ధికి విద్యే మూలం

పెద్దల స్ఫూర్తితోనే ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చా. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాం. విద్యార్థులు చదువుతోపాటు మానసిక వికాసం చెందేలా బోధన చేస్తున్నా. కొవిడ్‌లో యూట్యూబ్ చానల్ ద్వారా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించాను. నా వినూత్న బోధనా పద్ధతులను మెచ్చుకుని 2003లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలపై కూడా పోరాటాలు సాగించేందుకు ఉపాధ్యాయ సంఘ మండల శాఖ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నా. నేను పొందిన విజ్ఞానాన్ని నలుగురికి పంచాలన్నదే నా ఆశయం.

- పి.హిమబిందు, ఉపాధ్యాయిని, చినకొత్తలంక



ట్రాక్టర్లపై దేవతామూర్తుల అలంకరణలతో ప్రదర్శన

ప్రత్తిపాడులో వైభవంగా గౌరీదేవి సంబరాలు

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో గౌరీదేవి సంబరాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మున్సుబ్ వారి రామాలయం వీధిలోని గౌరీ శంకర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ట్రాక్టర్లపై కళాకారులు లవకుశలు, సీతారామ లక్ష్మణులు, పార్వతీపరమేశ్వరులు, ఆంజనేయుడు, వినాయకుడు, కనకదుర్గ, సాయిబాబా వేషధారణల్లో అలరించారు. బాణసంచా, డప్పుల వాయిద్యాల మధ్య కళారూపాల ప్రదర్శన గ్రామ పురవీధుల గుండా కొనసాగింది.

బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత... బాల్య వివాహాలు సాంఘిక దురాచారం: కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకునే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం రాత్రి జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త్ భారత్' కొవ్వొత్తుల ర్యాలీని వారు ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా తగు వయసు రాకుండా పెళ్లి చేయడం వల్ల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. బాల్య వివాహాల నిరోధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీ, ఆశా, మహిళా పోలీసులకు అవగాహన



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత, కలెక్టర్ ప్రశాంతి

కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 18ఏళ్లలోపు ఆడపిల్లలు, 21ఏళ్లలోపు మగ పిల్లలకు వివాహం చేస్తే వారిని ప్రోత్సహించిన వారు, సమాచారం తెలిసి దాచిన వారు, పెళ్లి చేసిన వాళ్లు కూడా చిక్కుల్లోపడక తప్పదన్నారు. రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉంటే ప్రభుత్వ అధికారులకు లేదా పారా లీగల్ వలంటీర్లకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా భావించాలన్నారు. దేశంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకూడదనే ఉద్దేశంతో 'బాల్య వివాహ ముక్త్ భారత్' విస్తృతంగా నిర్వహిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉన్న వాళ్లు వెంటనే తహసీల్దారు, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. తద్వారా ఆ వివాహాన్ని నిలిపివేయడం సాధ్యమవుతుందని, వారికి రక్షణ కల్పించడం జరగుతుందన్నారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఎంపికైన అనన్య, ఎం.ఝాన్సీశ్రీ

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఐ.పోలవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగం సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూలు విద్యార్థినులు హెచ్.అనన్య, ఎం.ఝాన్సీశ్రీ ఎంపికైనట్టు హెచ్ఎం సలాది వెంకటనారాయణ తెలిపారు. చిత్తూరు జిల్లా అరకొండలో జరిగిన పోటీల్లో వారి ఎంపిక జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను, పీడీ కళావతి, పీఈటీ అడ్డగళ్ల రామ్‌ప్రసాద్‌ను పీఎంసీ చైర్మన్ బసవా అప్పారావు అభినందించారు.

మనాలీ పర్వతారోహణలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల విద్యార్థులు

రాజానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనాలీలో నిర్వహించిన పర్వతారోహణలో తూర్పు గోదావరి జిల్లా రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అయిన ఎంబీబీఎస్ విద్యార్థులు ముళ్లపూడి చైతన్యరాజ్, కన్నీటి హర్ష పాల్గొని కోర్సు సీనియర్ హోదా అందుకున్నారని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వాటి మాధవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ సంస్థ ఇటీవల మనాలీలో నిర్వహించిన సాహసోపేతమైన పర్వతారోహణలో దేశవ్యాప్తంగా ఎంపికైన 90 మంది విద్యార్థు లు పాల్గొనగా అందులో ఏపీకి చెందిన 10 మంది వున్నారన్నారు. తమ కళాశాలకు చెందిన చైతన్యరాజ్ దేశవ్యాప్తంగా ఉన్న రోప్‌లీడర్లు, వలంటీర్లకు నాయకత్వం వహించి కోర్సు సీనియర్ హోదా అందుకున్నాడన్నారు. సాహసికులను జీఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, చీఫ్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్కే మిశ్రా అభినందించారు.



చైతన్యరాజ్, హర్షలను అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ సందీప్

అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలకు 30, 1 తేదీల్లో క్రీడాకారుల ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్/కాకినాడ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సైక్లింగ్ పోటీలు, జిల్లా జట్టు క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 30, డిసెంబరు 1 తేదీల్లో గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడంలోని గుడ్‌రోల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహిస్తున్నట్టు తూర్పు గోదావరి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి డీఎంఎం శేషగిరి, కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల సైక్లింగ్ క్రీడాకారులు తమ సైక్లింగ్ ఎక్విప్‌మెంట్‌తో మందడంలో 30వ తేదీ ఉదయం రిపోర్టు చేయాలని సూచించారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగే 29వ జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు సైక్లింగ్ కోచ్ వెంకటరావు (గుంటూరు) 9849379932, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (గుంటూరు) 9703092077 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా సమాఖ్య కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. కాకినాడ డీఎస్ఏ మైదానంలో అండర్-17 బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు చేరుకున్నారని, వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.





చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న విధు శేఖర భారతీ స్వామి, భక్తులకు అనుగ్రహభాషణ

ధర్మాచరణతోనే శ్రేయస్సు

శృంగేరీ జగద్గురు విధు శేఖర భారతీ మహా స్వామి

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి.... కష్టాలు వద్దనుకుంటే అధర్మాన్ని పరిత్యజించాలి... ధర్మం, అధర్మంతోనే సుఖదుఃఖాలు ఉంటాయి. కర్మానుసారం వాటిని అనుభవిస్తారు' అని శృంగేరీ జగద్గురు విధు శేఖర భారతీ మహాస్వామి ఉద్బోధించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున వున్న త్యాగరాజ నారాయణదాస సమితి ప్రాంగణంలోని శ్రీశృంగేరి శంకర మఠంలో బుధవారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆధునిక కాలంలో అనేక సౌకర్యాలు పెరిగాయి. విజ్ఞానం పెరిగింది కదా. ఇపుడు కూడా సనాతన ధర్మం అదీ ఇదీ అంటూ అవసరమా అని కొందరు అడుగుతుంటారు. వారికి నేనొక్కటే చెప్తాను. సౌకర్యాలు, టెక్నాలజీ పెరిగిన మాట వాస్తవమే. మహానుభావులు ఎవరో యంత్రాలు కనిపెడితే చాలా మంది అనుభవిస్తున్నారు. అయినా ప్రపంచంలో దుఃఖం అనేది తగ్గలేదు. వేరే మార్గాల్లో దుఃఖం వస్తుంది. సుఖమూ ఉందన్నారు. గతంలో లేని రోగాలు, మనకు పేరు కూడా తెలియని రోగాలను వింటున్నామన్నారు. సౌకర్యాల వల్ల దుఃఖం నివారించినా, మరో రూపంలో వస్తుందని విశదీకరించారు. దేవుడిచ్చిన మేరకు కష్టపడి సంపాదించుకుని అనుభవించాలి. సంపాదించింది అనుభవించకపోతే ఉపయోగం లేదు. అదే సమయంలో ధర్మ పాలనా ఉండాలని బోధించారు. ఇవి రెండూ జరిగితేనే హాయిగా ఉంటుందన్నారు. మనిషికి ధర్మమార్గం అత్యంత ఆదర్శం. సనాతన ధర్మం గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలి. ప్రతి విషయం వెనుక ఓ కారణం కచ్చితంగా ఉంటుంది. అన్నీ అర్థం చేసుకునే సామర్థ్యం మనుకు లేకపోవచ్చు. పూర్వమే రుషులు వాటి సారాన్ని మనకు అందించారని వివరించారు. ప్రతి మనిషికీ జిజ్ఞాస ఉండాలని, వితండ వాదన మంచిది కాదని జిజ్ఞాసతో ప్రశ్నించి గొప్పతనం తెలుసుకోవాలన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్ (ఆంధ్రజ్యోతి): విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్వత్సభ జరిగింది. పండితుల వేద ఘోషతో ఆ ప్రాంగణం ప్రతిధ్వనించింది. శతావధాని గన్నవరపు లలితాదిత్యచే అష్టావధానం రసవత్తరంగా సాగింది. పృచ్ఛకులుగా కడిమెళ్ల వరప్రసాద్, ఆచార్య శలాక రఘునాథ శర్మ, ధూళిపాళ మహదేవమణి, పాలపర్తి శ్యామలానంద, తాతా సందీప్ శర్మ, ఆకెళ్ళ బాలభాను పాల్గొనగా సంచాలకర్తగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణ వ్యవహరించారు.



అష్టావధానాన్ని వీక్షిస్తున్న విధు శేఖర భారతీ స్వామి

అన్నవరం దేవస్థానం ఈవోగా త్రినాథరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో త్రినాథరావు

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వేంద్ర త్రినాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సత్యదేవుడిని దర్శించుకోగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనివేటి మండపంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై తొలిసంతకం చేశారు. గతంలో రెండు పర్యాయాలు ఈవోగా ఆయన అన్నవరంలో బాధ్యతలు నిర్వహించారు.

రామచంద్రమోహన్‌కు వీడ్కోలు

గతేడాది కార్తీకమాసంలో అన్నవరం ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రమోహన్ దేవదాయశాఖ ప్రధాన కార్యాలయానికి వెళ్లడంతో ఆయనకు బుధవారం దేవస్థానం ఉద్యోగులు వీడ్కోలు సభ ఘనంగా చేపట్టారు. ఈ ఏడాది కార్తీకమాసంలో గిరిప్రదక్షిణ నిర్వహణ, కార్తీకమాసంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చేపట్టిన చర్యలపై ఆయనను ప్రశంసించారు. రామచంద్రమోహన్ దంపతులను ఛైర్మన్ రోహిత్, నూతన ఈవో త్రినాథరావులు సత్కరించారు.



రామచంద్రమోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారుల పర్యటన



గొల్లప్రోలులో పరిశీలన చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారుల బృందం

గొల్లప్రోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు చెందిన అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్ మేనేజ్‌మెంట్ అధికారుల బృందం బుధవారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో పర్యటించింది. సీనియర్ మేనేజర్ వంశీ, అసిస్టెంట్ మేనేజరు అనుప్రియ, ఆఫీసర్ రాహుల్‌రెడ్డి నగరపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. లిక్విడ్, సాలిడ్ వేస్ట్(విజువల్) మేనేజ్‌మెంట్ ట్రీట్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారులతో కలిపి పరిశీలించి అనుకూలతలపై సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో 93 మునిసిపాలిటీలు, నగరపంచాయతీలను వీటి ఏర్పాటుకు ఎంపిక చేయగా, అందులో గొల్లప్రోలు ఒకటి. ఇప్పటికే చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. అధికారుల వెంట గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్, తహశీల్దారు సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు సౌజన్య ఉన్నారు.

భూ సమతుల్యత వైవిధ్యం కాపాడుకోవాలి

దివాన్‌చెరువు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూ సమతుల్యత వైవిధ్యం కాపాడుకోవడం సమష్టి బాధ్యత అని సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు, ప్రచారకులు విజయరామ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని డీబీవీరాజు టౌన్‌షిప్‌లో గల శ్రీరాజేశ్వరీ కళ్యాణ మండపంలో భావితరాల కోసం గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయరామ్ మాట్లాడుతూ గ్రామీణ వికాసం కోసం ప్రస్తుతం మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారన్నారు. దీని వల్ల భూతాపం పెరిగిపోతోందని చెప్పారు. అందువల్ల భూతాపం తగ్గించడంతో బాటు భూసమతుల్యతను కాపాడేవనిని చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా ఐదు అంచెల సాగువిధానం చేపట్టాలని చెప్పారు. ఇందులో అంతర్ పంటలు, దుంపలు, వంటివి ఉంటాయని ఒకసారి దున్నితే మళ్లీ భూమి దున్నవలసిన అవసరం ఉండదని చెప్పారు. అలాగే వెదురును సాగు చేసి చెంచాలు ప్లాస్టిక్ వస్తువులు స్థానే వెదురు చేసిన చెంచాలు వంటివివిధ వస్తువులు తయారు చేయవచ్చునన్నారు. ఈ విధంగా చేయడం, ఐదు అంచెలసాగు విధానం వల్ల ఎకరానికి వచ్చే ఆదాయం రూ.6 లక్షలకు పెరుగుతుందని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 24 వతేదీ వరకూ హైదరాబాద్ సమీపంలోని శాంతివనంలో పదివేలమంది రైతులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీజాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి కేంద్రబడ్జెట్‌లో రూ.2800 కోట్లు మంజూరుకు కేబినెట్ ఆమోదం కుడా లభించిందన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పుకు అనుగుణంగా వ్యవసాయ విధానంపై సదస్సు నిర్వాహకుడు అంబటిశివప్రసాద్ ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయరామ్

మెగా పేరెంట్ మీటింగ్‌ని వాయిదా వేయాలి

యూటీఎఫ్ వినతి



తూర్పుగోదావరి డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డిసెంబరు 7న నిర్వహించాలని నిర్ణయించిన మెగా పేరెంట్ మీటింగ్‌ని వాయిదా వేయాలని తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ నాయకత్వం కోరింది. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు జయకర్, షరీఫ్ డీఈవో కె.వాసుదేవరావుకు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఆ రోజున సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని గోదావరి జిల్లాల్లో ఘనంగా జరుపుకుంటారని, అందువల్ల ఆ రోజున జిల్లాలోని పాఠశాలలకు లోకల్ హాలిడే ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకవేళ పాఠశాల నిర్వహించినా విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉంటుందన్నారు. పైగా ఎన్నికల కోడ్ 10వ తేదీ వరకూ అమలులో ఉంటుందన్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని ఏలూరు, పశ్చిమ, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని 10వ తేదీ తర్వాత నిర్వహించాలని వారు అభ్యర్థించారు.

ఒకే కుటుంబానికి చెందిన...

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

హోటల్ ప్రారంభించి నష్టాలు రావడంతో పురుగుల మందు తాగిన బాధితులు



రాజమహేంద్రవరంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచలనం రేపింది. ప్రకాశ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికానగర్‌లో సాయిశుభా అపార్ట్‌మెంట్ ఎస్3 ఫ్లాట్‌లో పాతూరి ఉపేంద్రకుమార్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. కొద్ది నెలల క్రితం ఎస్‌వీ రెస్టారెంట్ పేరుతో అదే ప్రాంతంలో ఓ హోటల్ ప్రారంభించారు. పెట్టుబడి, నిర్వహణ కోసం సుమారు రూ.40లక్షలు అప్పు చేశారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో.. అప్పులు తీర్చ లేమనే మనస్తాపం చెందారు. దీంతో కుటుంబ యజమాని పాతూరు ఉపేంద్ర కుమార్, భార్య లక్ష్మీవిజయ, కుమారుడు సంతోశ్ బుధవారం ఉదయం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగామని బాధితులు చెబుతున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాళ్లను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం తప్పిందని, సురక్షితంగా ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే ఆత్మహత్యాయత్నం కావడంతో ఎలాంటి పోలీసు కేసూ నమోదు కాలేదు.

మీ చేతిలోనే.. మీ సేవ

- ఇక నిమిషాల్లో ఈసీ, సీసీ
- మీ సేవల ద్వారా సేవలు యథాతథం
- మధ్యవర్తుల ప్రమేయానికి చెక్
- గేట్ వేను అభివృద్ధి చేసిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అందిస్తున్న పలు రకాల సేవలు ఇక మరింత సులభతరమయ్యాయి. ఇప్పుడు ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), సర్టిఫైడ్ కాపీ (సీసీ)ల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. సగటు పౌరుడు సైతం నేరుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్ విధానంలో అవసర మైన రుసుము, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు చెల్లిస్తే క్షణాల వ్యవధిలో ఆయా సేవలు పొంద వచ్చు. ప్రస్తుత ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయం ఉండబోదని అధికారులు చెబుతున్నారు. మీసేవా కేంద్రాల్లో ఈసేవలు అందుబాటలో లేవని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని చెబుతున్నారు.

ఆన్‌లైన్ విధానంతో సత్ఫలితాలు..

గతంలో ఈసేవల పొందేందుకు ప్రతీ ఒక్కరూ మీసేవా కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. కొత్త ప్రభుత్వం ఈ శ్రమను సైతం తగ్గించా లని నిర్ణయించింది. ఫలితంగా అందుబాటు లోకి వచ్చిన ఆన్‌లైన్ విధానం సత్ఫలితాలను ఇస్తోంది. నిర్ణీత దరఖాస్తు నింపి దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లేదా మీసేవా తీసకెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇందుకోసం స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ తన వెబ్‌సైట్ ద్వారా చెల్లింపు గేట్‌వేను అభివృద్ధి పరిచింది. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో ఈసీ,సీసీ కాపీలను తక్షణమే పొందగలిగే వెసులుబాటు లభించింది.

గ్రామీణ ప్రాంతాల్లో కూడా..

ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేని గ్రామీ ణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాల ద్వారా ఆయా కాపీలను అందుకోవచ్చు. దానికి ఎలాంటి పరి మితులు లేవు. గతంలో వీటికోసం మీసేవలో దరఖాస్తు చేశాక, అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ తగిన అనుమతులు పొందిన తరువాత మీసేవలో మాత్రమే డాక్యుమెంట్లను పొందగలిగేవారు. ఫలితంగా మితిమీరిన కాలయాపన జరిగేది. దరఖా స్తుదారు రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చే ది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా తక్కువ సమ యంలో డాక్యుమెంట్లు ప్రజలకు చేరనున్నాయి. గతంలో దరఖాస్తుదారు చెల్లించిన రుసుము మీసేవ విభాగానికి జమయ్యేవి. ఇప్పుడు నేరుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు చేరనున్నాయి.

నౌకలన్నీ బంద్..



- -కాకినాడ పోర్టులో ఒకటో నెంబర్ తుఫాను హెచ్చరిక జారీ
- -ఈనెల 30వరకు సముద్రంలో ఎక్కడి షిప్పులు అక్కడే..
- -ప్రస్తుతం కాకినాడకు బియ్యం, ఇతర కార్గో కోసం పది నౌకలు రాక
- -వీటిలో 8 నౌకల్లోకి సరుకు లోడింగ్ నిలిపివేత
- -సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బార్జీల రాకపోకలకూ రెడ్‌సిగ్నల్

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నైరుతి బంగాళాఖాతంలో 'ఫెంగల్' తుఫాను హెచ్చరిక నేపథ్యంలో ఆ ప్రభావం కాకినాడ జిల్లాపైనా పడనున్నట్టు వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కాకినాడ పోర్టుకు ఒకటో నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ అయింది. దీంతో కాకినాడ పోర్టులో ఈనెల 30వరకు ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలను నిలిపివేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో తీవ్రవాయుగుండం తుఫానుగా మరికొన్ని గంటల్లో మారనుండడంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. బలమైన ఈదురుగాలులతో బలంగా కెరటాలు ఎగసిపడుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ నౌకల్లోకి కార్గో లోడింగ్‌ను నిలిపివేస్తూ పోర్టు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం కాకినాడ పోర్టుకు బియ్యంతోపాటు ఇతర కార్గో లోడింగ్, అన్‌లోడింగ్ కోసం పది నౌకలు వచ్చాయి. వీటిలో 2హోప్ ఐలాండ్‌కు సమీపంలో ఉన్నాయి. హోప్‌ఐలాండ్ వల్ల కొంత గాలుల తీవ్రత తక్కువగా ఉండడంతో వీటికి బుధవారం వరకు లోడింగ్ జరిగింది. మిగిలిన 8 నౌకలు దూరంగా ఉండడంతో వీటిని అక్కడే నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. ఈనెల 30 వరకు సముద్రంలోనే లంగరు వేయాలని సూచించారు. నౌకలకు కార్గోను తరలించే బార్జీల రాకపోకలను సైతం ఈనెల 30వరకు నిలిపివేశారు. మరోపక్క తుఫాను ప్రభావంతో ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. పెద్దఎత్తున అలలు బీచ్‌రోడ్డును తాకుతున్నాయి.

నిరంతర కృషితో పోటీ పరీక్షల్లో గెలుపు

- తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్
- సివిల్స్ ఉచిత శిక్షణ స్క్రీనింగ్ పరీక్షకు 70 మంది హాజరు



సివిల్స్ స్క్రీనింగ్ పరీక్ష ఓఎంఆర్ షీట్‌ను కలెక్టర్ ప్రశాంతికి అందజేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కృషితోనే పోటీ పరీక్షల్లో గెలుపు సాధ్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష ప్రశ్నాపత్రం, ఓఎంఆర్ షీట్లను బీసీ వెల్ఫేర్ అధికారులతో కలసి కలెక్టర్ ఓపెన్ చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయని, స్క్రీనింగ్ పరీక్షకు 70 మంది హాజరయ్యారని అన్నారు. ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలలపాటు ఉచితంగా శిక్షణ, స్టయిఫండ్ కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సివిల్స్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు పట్టుదలతో ప్రయత్నించి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణను ఆర్డీవో కృష్ణనాయక్, బీసీ వెల్ఫేర్ అధికారిణి కేఎన్ జ్యోతి, సహాయ బీసీ వెల్ఫేర్ అధికారి సత్యరమేష్, ఇతర అధికారులు పరిశీలించారు.

పింఛన్‌దారుడు మరణిస్తే..నెల రోజుల్లోనే భార్యకు పింఛన్

కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయం

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్‌దారులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ముందుగా ఇచ్చిన హామీ మేరకు నెలకు పింఛను రూ.4వేలకు పెంచారు. 3నెలలకు అదనంగా రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలను పింఛన్‌గా అందజేశారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం మరో ప్రకటన విడుదల చేసింది. పింఛనుదారుడు మృతి చెందితే నెలరోజుల్లోనే అతడి భార్యకు వితంతు పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపింది. దీంతో పింఛన్ తీసుకుంటూ ఏ వ్యక్తి అయినా మృతిచెందినా మరణానంతరం భార్య జీవనానికి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఆమెకు వితంతు పింఛను అందేలా తీసుకున్న ప్రభుత్వం నిర్ణయంపై డీఆర్‌డీఏ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సారథ్యంలో ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇవే....

ఎన్టీఆర్ భరోసా పింఛనుదారుడు మరణిస్తే భార్యకు వెంటనే ప్రభుత్వం వితంతు పింఛను మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెన్షన్‌దారుడు నవంబరు 1 తర్వాత మరణిస్తే మరణ ధ్రువీకరణ పత్రాన్ని పింఛన్‌దారుడి భార్య నవంబరు 15లోపు, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు అందజేస్తే ఆమోదం పొందిన తరువాత డిసెంబరు 1 నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి 1,38,249మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఇప్పటికే రూ.41,47,47,000 నగదును పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ నవంబరు 15 తర్వాత అందజేస్తే 2025, జనవరి 1 నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీరపాండ్యన్ జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా కార్యాలయాలకు అందాయి.

కోటి దీపోత్సవం

కార్తీక మాసం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి గట్టున గల సరస్వతీఘాట్ వద్ద బుధవారం సాయంత్రం కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు దీపాలు వెలిగించారు.
- రాజమహేంద్రవరం కల్చరల్







సరస్వతీఘాట్ వద్ద మెట్లపై వెలిగించిన దీపాలు, శివలింగానికి అలంకరణ దృశ్యాలు

స్కూటీని ఢీకొన్న బస్సు

ఇంటర్ విద్యార్థిని మృతి



మృతిచెందిన రూపాదేవి

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థిని మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేమగిరితోటకు చెందిన పితాని రూపాదేవి (17) రాజమహేంద్రవరంలో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. రూపాదేవి మేనత్త కల్లా దుర్గ కూడా డిగ్రీ పరీక్షలు రాసేందుకు రాజమహేంద్రవరం వెళ్తుంది. ఈ నేపథ్యంలో కల్లా దుర్గ, పితాని రూపాదేవి ఇద్దరూ స్కూటీపై బయలుదేరారు. వేమగిరితోట నుంచి రాజమహేంద్రవరం వెళ్తూ సెంటర్ వద్ద వారి స్కూటీని రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆదిత్య కళాశాల బస్సు ఢీకొంది. దీంతో స్కూటీతో సహా ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. స్కూటీ వెనుక కూర్చున్న రూపాదేవి మీద నుంచి బస్సు చక్రాలు వెళ్లిపోయింది. గాయాలపాలైన ఇద్దరిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దుర్గకు గాయాలవ్వగా, రూపాదేవి చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త హత్యాయత్నం

చాకుతో దాడి



పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జయలక్ష్మి

ఎటపాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున అల్లూరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ ఎర్రబోరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రబోరు గ్రామానికి చెందిన బొగ్గా జయలక్ష్మీకి బొగ్గా రామకృష్ణతో పదకొండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే 8 నెలలుగా భార్యభర్తలు విడిపోయి దూరంగా ఉంటున్నారు. జయలక్ష్మి పుట్టిళ్ల అయిన ఎర్రబోరు గ్రామంలో ఉంటుంది. ఈక్రమంలో రామకృష్ణ బుధవారం తెల్లవారుజామున భార్య ఇంటికి వచ్చి గొడవపడి చాకుతో భార్య కాళ్లపై దాడి చేశాడు. జయలక్ష్మి కేకలు వేయడంతో అక్కడ నుంచి రామకృష్ణ పరారైయ్యాడు. వెంటనే జయలక్ష్మిని గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలించారు. గాయం కారణంగా 4కుట్లు వేశారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక జీతం ఆశ చూపి మోసం

గల్ఫ్ ఏజెంట్లపై కేసు నమోదు

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక జీతం ఆశచూపి మస్కట్ పంపి తన సోదరిని ఇద్దరు ఏజెంట్లు మోసగించారంటూ బాధితురాలి తమ్ముడు యండ్ర శివగణేష్ ఇచ్చిన పిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ బుజ్జిబాబు బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన మేకా గంగా భవానికి మస్కట్‌లో అధిక జీతం వస్తుందని నమ్మించి గండి జయసుధ, సాదే నరేంద్ర అనే ఇద్దరు గల్ఫ్ పంపారు. గల్ఫ్‌లో గంగాభవాని ఆరోగ్యం బాగోలేకపోవడంతో ప్రస్తుతం స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏజెంట్లకు కొంతమొత్తం ఇచ్చినా ఇండియాకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయకుండా వారు మోసగించినట్టు బాధితురాలి సోదరుడు శివగణేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు సత్యదేవుడి సన్నిధికి భారతీ స్వామి రాక

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి గురువారం శృంగేరీ పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి విచ్చేయనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామీజీ సాయంత్రం 5గంటలకు సత్యదేవుని దర్శించి తిరిగి రాజమహేంద్రవరం పయనమవుతారని వారు చెప్పారు.

భలే ఉంది..బుల్లి దూడ

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో పుంగనూరు రైతు రెడ్డి సత్తిబాబుకు చెందిన పుంగనూరు ఆవుకు కేవలం 12 అంగుళాల ఎత్తులో పెయ్యి బుల్లి దూడ జన్మించింది. సాధారణంగా పుంగనూరు దూడలు 15నుంచి 18అంగుళాలు ఎత్తు ఉంటాయి. ఇంత తక్కువ ఎత్తులో పుట్టడం అరుదుగా జరుగుతుంటాయని పశువైద్యాధికారులు చెబుతున్నారు. పుంగనూరు దూడను రైతులు, పశుప్రేమికులు ఆసక్తి తిలకిస్తున్నారు.



రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుడి పాత్ర కీలకం

● డీఈవో వాసుదేవరావు



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

రాజానగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుని పాత్ర అత్యంత కీలకమైందని, ఉన్నతాధికారులకు అందజేయాల్సిన అనేక ప్రొఫార్మాలు, కీలకసమాచారం వల్ల ప్రధానోపాధ్యాయులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండలంలో మల్లంపూడిలో జరుగుతున్న లీడర్ షిప్ శిక్షణా తరగతులను బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెరుగైన నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించడానికి లీడర్‌షిప్ శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. కేవలం రికార్డులు నిర్వహించడమే కాకుండా ఉపాధ్యాయులకు తరగతులను కేటాయించడం, వారి పనితీరు సమీక్షించడం, సమాజంలో తల్లిదండ్రులతో సమన్వయంగా మెలగడం, విద్యార్థులకు క్రమశిక్షణ అలవర్చడం, మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి అనేక అంశాల్లో ప్రధానోపాధ్యాయులు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. పాఠశాల సమయమంతా ప్రణాళికా బద్ధంగా నిర్వహించేలా ఈశిక్షణా తరగతుల్లో చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకర్, 190 మంది ప్రధానోపాధ్యాయులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

:ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు ఉపాధ్యాయులకు సూచించారు. కొండగుంటూరులోని శ్రీసత్యసాయిపరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఎఫ్.ఎల్.ఎన్. శిక్షణాతరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాల విద్యలో ప్రాథమిక పాఠశాల అత్యంత కీలకమైనదని, ఆ విద్యార్థులే మన భవిష్యత్‌అని చెప్పారు. ఒకటి నుంచి 5వతరగతి వరకూ పునాది అభ్యాసనా కృత్యాలు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. కోర్స్‌డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, పరిశీలకులు జానకి, రీసోర్స్‌పర్సన్ వి.మహేల, ప్రథమ్ సంస్థ ట్రైనీ అసోసియేట్ అనిల్‌కుమార్, జిల్లాకోఆర్డినేటర్ ఎం.జీవన్‌సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'పంటల భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి'



బీమా ధ్రువపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) పంటల భీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు డి.సుధీర్‌కుమార్, బీమరాజు తెలిపారు. పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రబీ-24-25, జీడి మామిడి పంట భీమాపథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి పసల్‌బీమా యోజనా పథకంలో బాగంగా అమలు అవుతున్న ఈ పథకంలో ఖరీఫ్‌లో అరటి, రబీలో జీడిమామిడి పంటలకు బీమా సదుపాయం కల్పించారన్నారు. ఈ నెల 1నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటకు నష్టం వాటిల్లితే ఏపీఎస్‌డీపీఎస్ ఇచ్చే నివేదికను అనుసరించి పంటల భీమా వర్తిస్తుందన్నారు. ఏఈవో పీటర్, ఉద్యాన సహాయకులు జి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి, ఫీల్డ్‌డే కార్యక్రమంపై రైతులకు శిక్షణ

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో పొలంబడి, ఫీల్డ్ డే కార్యక్రమంపై రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌మాధవరావు పంటకు కావాల్సిన పోషకాలు గురించి వివరించారు. వరిలో సమగ్ర సస్యరక్షణ, విత్తనం ఎంపిక చేసుకునే విధానం గురించి, ఎరువుల యాజమాన్యం, ఎనీటియాజమాన్యం, కలుపు మందుల యాజమాన్యం గురించి శాస్త్రవేత్త ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి, సేంద్రియ వ్యవసాయాల వలన పంటలో మేలైన దిగుబడులు వస్తాయని తెలిపారు. రాజమహేంద్రవరం సబ్-డివిజన్ మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులు, ఉద్యానసహాయకులు పాల్గొన్నారు.

రైతుల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



ధాన్యం రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తమకు నచ్చిన మిల్లు వద్ద ధాన్యాన్ని అమ్ముకోవచ్చని దీనిపై అధికారులతో మాట్లాడానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ కార్యాలయం వద్ద మంగళవారం అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికలతో తడిగా ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో వారంతా వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయానికి చేరుకుని తమ ధాన్యాన్ని మిల్లర్లు కొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వల్లేపల్లి శ్రీనివాస్‌తో మాట్లాడారు. రైతులు తమకు నచ్చి న నియోజకవర్గంలోని రైస్‌మిల్లర్లకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చని అధికారులన్నారు. సమావేశంలో ఏడీఏ మల్లికార్జునరావు, డీఎస్‌వో, ఏవో తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు తొలి ప్రాధాన్యం

రుడా ఛైర్మన్ వెంకటరమణ చౌదరి



దివాన్‌చెరువులో శ్రీలక్ష్మీగణపతి ఆలయాన్ని దర్శించుకున్న రుడా ఛైర్మన్ చౌదరి

దివాన్‌చెరువు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)కు మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నానని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. దివాన్‌చెరువులోని టీడీపీ నాయుడు పెనుగొండ చిన్ని మొక్కుబడి చెల్లించేందుకు శ్రీలక్ష్మీగణపతి, కనకదుర్గమ్మ ఆలయాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ ఆలయాల్లో 110 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా నిధులు పొందాలంటే రుడాకు మాస్టర్‌ప్లాన్ ఎంతో అవసరమన్నారు. శ్రీలక్ష్మీగణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, నాయకులు దాసరి నాగేశ్వరరావు, ఖండవిల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో పలు సమస్యలపై ఎమ్మెల్యే సూచన

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల శాసనసభ సమావేశాల్లో రూరల్ శాసనసభ్యుడు, సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి పలు సమస్యలపై స్పందించారు. 2027 గోదావరి పుష్కరాలకు సంబంధించి అభివృద్ధి పనులు, దానికి సంబంధించిన ప్రణాళికలపై సభాపతి దృష్టికి తీసుకువచ్చారు. గత పుష్కరాలను పరిగణనలోకి తీసుకుని ఇప్పుడు చేపట్టాల్సిన పనులపై ఆయన ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో విశ్వవిద్యాలయాన్ని తరలిస్తారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నందున్న తెలుగు విశ్వవిద్యాలయాన్ని పటిష్టం చే యాలన్నారు. బొమ్మూరులోనే ఉంచాలని సభాపతిని కోరారు. ఈ అంశాలకు సంబంధించి ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలిసింది. పుష్కరాల పనులపై కూడా ఇప్పటికే సీఎం చంద్రబాబు ఒక క్లారిటీతో ఉండటంతో ఎమ్మెల్యే సూచనలు, అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్నట్లుగా ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఘనంగా కార్తీక దీపోత్సవం

కోరుకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ వద్ద కార్తీక బహుళ ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అడపా వీరబాబు దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి పాదాల వద్ద కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామివారి పాదాల వద్ద అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామి వారి కొండ పాదవునా మెట్లకు ఇరువైపులా కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కార్తీక అన్న సమారాధన కమిటీ సభ్యులు, దీపోత్సవ కమిటీ సభ్యులు, అర్చకస్వాములు, జనసేన నాయకులు బదిరెడ్డి దొర, టి.శ్రీను, గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ, వీరగణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, వైద్యంపై అసెంబ్లీలో ప్రస్తావన

● సమస్యలపై ప్రసావించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలలో రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కొన్ని ముఖ్యమైన సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా పేదలకు అందించే వైద్యసేవల్లో ఉన్న లోపాలను అసెంబ్లీలో లేవనెత్తారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుతున్న అరకొర వైద్యసేవలు, సౌకర్యలేమి, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అసెంబ్లీలో సమస్య లెవనెత్తగానే వేటు పడుతుందనే భయంలో వైద్య సిబ్బం ది అప్రమత్తమై జాగ్రత్తగా విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా నగరంలో మహిళల భద్రతకు సబంధించి నిర్వహిస్తున్న మీ భద్రత మా బాధ్యత కార్యక్రమం గురించి నిర్వహిస్తున్న సభల గురించి సభ దృష్టికి తీసుకువచ్చారు. బ్లే డు బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌ల నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలపై కూడా అసెంబ్లీ ప్రస్తావించారు. ఇప్పటికే గడచిన ఐదునెలల కాలంలో అదుపులోకి తీసుకువచ్చారని చెప్పారు. సోషల్ మీడియాలో వైసీపీ అల్లరి మూకలు గతఐదేళ్లుగా పెట్టిన పోస్టింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని చర్యలు తీసుకోవాలని సభాపతి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. దీనికి తగ్గట్టుగానే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదే రితిలో రాజమహేంద్రవరంలో భాస్కర్ నగర్ లేఅవుట్‌లో జరిగిన అక్రమాలపై కూడా అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ భూముల వ్యవహారంలో అధికారులను తప్పుదారి పట్టించిన వారిపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. అదేవిధంగా గోదావరి పుష్కరాల 2027కు సంబంధించి చేపట్టాల్సిన పనులపై అసెంబ్లీలో ప్రస్తావించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అందరూ ఆరోగ్యంగా ఉంటేనే మానవవనరులు సద్వినియోగమై సమాజం అభివృద్ధి చెందుతుందని రాజ్యామహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొత్తం ఆసుపత్రిని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామ్‌గోపాల్ వర్మ చట్టం నుంచి తప్పించుకోలేవు

వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ అండ చూసుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తూ అప్పటి ప్రతిపక్షనేత ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లపై ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తూ సినిమాలు తీసిన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ చట్టం నుంచి తప్పించుకోలేరని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రామ్‌గోపాల్ వర్మ, నటి శ్రీరెడ్డి, పోసాని కృష్ణమురళీ చేసిన తప్పుడు వ్యాఖ్యల విషయంలో చట్టం తన పని తాను చేసుకుని వెళుతుందన్నారు. అప్పుడు తప్పుగా మాట్లాడి ప్రవర్తించి ఇప్పుడు తప్పయిపోయింది క్షమించండి రాజకీయాలకు దూరంగా ఉంటామంటే, రాజకీయాలు మాట్లాడటం అంటే చేసిన తప్పులు ఒప్పులు కావన్నారు. వర్మతీసిన సినిమాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లను కించపరిచేవిధంగా సన్నివేశాలు ఉన్నాయని 23 మంది టీడీపీ ఎమ్మెల్యేలను కూడా అవమానించే విధంగా సినిమా తీశారని ఈఎమ్మెల్యేలలో తన సతీమణి కూడా ఉన్నారని అన్నారు. ఆ సినిమాను సజ్జల నిర్మించారని గుర్తుచేశారు. అందరిపైన చటప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు

● ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర, తప్పుడు పోస్టుపెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. కంబాలపేటకు చెందిన బి.రమేశ్.. ఎస్‌వీఎస్ కోచింగ్ సెంటర్‌ని నడుపుతున్నాడు. ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్ పామ్‌లలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తన కోచింగ్ సెంటర్‌కి సంబంధించిన విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్‌చేసి అసభ్యకర పోస్టు పెట్టారని ఫిర్యాదు చేశారు. దీనిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో అధునాతన పరిజ్ఞానం సహాయంతో విశాఖజిల్లా కోతరుట్ల గ్రామానికి చెందిన దాసరి నాగేశ్వరరావు అనే యువకుడిని నిందితుడిగా గుర్తించారు. అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించి నట్లు ఎస్పీ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. అసభ్యకరమైన, శాంతి భద్రతకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు పెడితే కటకటాలు తప్పవని హెచ్చరించారు. అలాంటి పోస్టును ఫార్వర్డ్, షేర్, లైక్,కామెంట్ చేసినా చిక్కులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

విస్టార్‌లో కిడ్నీ మార్పిడి వైద్యసేవలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సరైన సమయంలో సత్వర చికిత్స అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారికి అత్యాధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఏలూరు ఆశ్రం హాస్పటల్స్ రాజమహేంద్రవరంలోని విస్టార్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో కిడ్నీ మార్పిడి వైద్య సేవలను ప్రారంభించినట్టు విస్టార్ హాస్పిటల్స్ ముఖ్య పరిపాలనాధికారి డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలు, నూతన సాంకేతికతను వినియోగించి ఈ సౌకర్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జీవన్‌దాన్ పర్యవేక్షణలో ఈ కిడ్నీ మార్పిడి వైద్యసేవలను అందజేశామని హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ కొలుకుల తెలిపారు. డాక్టర్ వెంకట చైతన్య సింగంశెట్టి నేతృత్వంలో ఈ సేవలు అందజేస్తామని తెలిపారు. అవగాహహన తోనే ప్రాణాంతక వ్యాధుల పట్ల రక్షణ పొందవచ్చని హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎస్ రాజరాజన్ తెలిపారు.

ఉచిత బీఎండీ పరీక్షలు

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, స్థానిక ఏఎస్ఆర్ హాస్పిటల్ వారా ఆధ్వర్యంలో ఉచిత (బీఎండీ) ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ డాక్టర్ కొమ్మా శ్రీనివాస్,డాక్టర్ సుస్మిత ఉచిత సేవా శిబిరానికి వచ్చిన అందరికీ ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 45 సంవత్సరాలు దాటిన ప్రతీఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని, మహిళలు అధిక పోషక విలువలు ఉండేలా పాలు,పండ్లు మొదలగు వాటిని తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉప్పల శ్రీను,కోశాధికారి సాయిబాబా, కన్వీనర్ బీఎస్ఎన్‌మూర్తి, జాయింట్ సెక్రెటరీ బిఅప్పారావు, రవి, మురళి, ఎంవిధర్మారెడ్డి, ఎశ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన పెంపొందించాలి

● అనపర్తి నియోజకవర్గ ఈఆర్వో మాదురి



ర్యాలీలో పాల్గొన్న ఎన్నికల అధికారిణి మాదురి

అనపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విదంగా చైతన్యం తీసుకురావాలని అనపర్తి నియోజకవర్గ ఈఆర్వో డాక్టర్ ఎమ్ మాదురి అన్నారు. బుథవారం అనపర్తిలో నియోజకవర్గ స్థాయి బిఎల్‌వోలతో సమావేశం నిర్వహించిన ఆమె బిఎల్వోలతో కలిసి మెయిన్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. అనపర్తి తహసీల్దార్ అనిల్ కుమార్ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ దేవీచౌక్ నుండి మెయిన్‌రోడ్డు మీదుగా సాగింది. ఈ సంద ర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా బిఎల్వోలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల తహసీల్దార్‌లు, నియోజకవర్గ బిఎల్వోలు పాల్గొన్నారు.



అన్నవరంలో వ్రతమాచరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

అన్నవరంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

అనపర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు బుధవారం పలు ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. విశాఖ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు బుధవారం ఉదయం సింహాచలం వరహా లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నవరం చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. ఎమ్మెల్యే దంపతులతో బాటు కె.శ్రీనివాసరావు దంపతులు కూడా స్వామి వ్రతం చేశారు. వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనం అందజేశారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి



రాజానగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నరేంద్రపురం గ్రామ వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న పెనుమాక గనిరాజు (48) గుండెపోటుతో బుధవారం మరణిం చారు. జేగురుపాడి గ్రామానికి చెందిన గనిరాజు ఎనిమిదేళ్ల కిందట రాజానగరం మండలానికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం నరేంద్రపురం వీఆర్వోగా పనిచేస్తున్న ఈయన హౌస్‌ట్యాక్స్ డేటా ఎంట్రీ నమోదులో భాగంగా బుధవారం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంది. వేకువజామున ఆరోగ్యం బాగోలేకపోవ డంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్దకు వెళుతున్న తరుణంలో ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జేగురుపాడులో అంత్యక్రియలు జరిపారు. ఈయన మృతిపట్ల కలెక్టరేట్ ఏవో అనంతలక్ష్మి సత్యవతిదేవి, డిటీ ఏ.కుమారి, ఆర్ఐ రంభ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు

ల్యాండ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం భాస్కర్‌నగర్‌లో ల్యాండ్ మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నవీన్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత కాశి నవీన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి స్థలాలు కబ్జా చేస్తున్నారని ఈ సమస్యను ఎమ్మెల్యే వాసు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజానగరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కును కలిగి ఉండాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ఓటరు అవగాహనలో ఆయన మాట్లాడారు. పద్దెనిమిది ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రశాంతి టోల్‌ఫ్రీ నెంబరు 1800 425 1110 లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్. రామచంద్రన్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు ప్రాథమిక హక్కు అని తెలిపారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ రామారావు ఆన్‌లైన్‌లో ఓటును ఎలా నమోదు చేసుకోవాలో తెలిపారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ మూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ

సీతానగరం, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో ఏటిగట్టుపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద తణుకుకు చెందిన ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో మహిళలు హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణ చేశారు. స్వామివారికి కుంబ, నక్షత్ర, నాగ హారతి వంటి పలు రకాల హారతులు ఇచ్చారు. దీప ధూప నైవేద్యాలతో స్వామివారికి ప్రత్యే పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

గోకవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యతని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రావ్యశృతి అన్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా సంస్థ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయులకు మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ సభ్యులు సురేష్‌కుమార్, అనిల్ కుమార్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగరత్నం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ నాగరత్నం అన్నారు. బుధవారం రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినిలకు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వన్‌స్టాప్ సెంటర్ ద్వారా సెల్ఫ్ డిఫెన్స్, మహిళా చట్టాలపై అవగాహన చేశారు. ఎస్‌ఐ, కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య మాట్లాడారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మిన్ సౌజన్య, ఎం.మరియా కుమారి, మహిళా రక్షక్ సభ్యులు, కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ వీర వెంకట్రావు, సిబ్బంది సుధారాణి, అధ్యాపకురాలు సాయికుమారి, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

రేపు హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర క్షేత్రంలో అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో 29న ప్రత్యేక పూజలు చేపట్టినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మార్గాని సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రతీ ఏటా కార్తీక మాసంలో మాసశివరాత్రి రోజున స్వామివారికి ప్రత్యేక పూజతో పాటు భక్తుల సహకారంతో 50 వేల మందికి అన్నసమారాధన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మార్గాని సత్యనారాయణ, మల్లు పోలరాజు, ఆరేటి భద్రరావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి ఆలయానికి విరాళం

కడియం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వీరవరం గ్రామంలోని చేనేతకాలనీలో శ్రీలక్ష్మీగణపతి, నందీశ్వరస్వామి, చౌడేశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి రూ.50వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రొబ్బి శేఖర్, సింగ్ సురేంద్రప్రసాద్, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీనివాసు, యర్ర శ్రీను, ఉట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి


శృంగేరీ జగద్గురు విధుశేఖర భారతీ మహా స్వామి



కోటి దీపోత్సవం కార్తీక మాసం సందర్భంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున సరస్వతీఘాట్ వద్ద బుధవారం రాత్రి జరిగిన కోటి దీపోత్సవం - 8లో



ర్యాలీ.. రాజమహేంద్రవరంలో బుధవారం రాత్రి నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త్ భారత్' కొవ్వొత్తుల ర్యాలీ. చిత్రంలో పీజేడీ గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి తదితరులు - 8లో



అభిభాషణ రాజమహేంద్రవరంలోని త్యాగరాజ నారాయణదాస సేవా సమితి భవనంలో జరిగిన పూజా కార్యక్రమంలో హారతి దృశ్యం - 8లో



అనపర్తి ఏరియా ఆసుపత్రి

కాయకల్ప ప్రోగ్రాం ద్వారా

రాష్ట్రంలోనే ఉత్తమ తృతీయ ఏరియా ఆసుపత్రిగా అనపర్తి

ఆసుపత్రి అభివృద్ధికి రూ. 5 లక్షల నజరానా

అనపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, ఆసుపత్రి పనితీరు, శుభ్రత పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి ఉత్తమ ఆసుపత్రులుగా ఎంపికైన ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం నజరానా ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల ఒక బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేసి నివేదికను సమర్పించింది. దీనిలో భాగంగా ఏరియా ఆసుపత్రుల్లో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఆసుపత్రుల ఎంపికలో అనపర్తి ఏరియా ఆసుపత్రి తృతీయ స్థానం దక్కించుకుని రూ.5 లక్షల నజరానాను సాధించింది. ఏరియా ఆసుపత్రుల్లో పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి 97 పాయింట్లతో ప్రథమ స్థానం సాధించి రూ.10 లక్షల నజరానాను సొంతం చేసుకుంది. ఏలూరు జిల్లాలోని నూజివీడు ఏరియా ఆసుపత్రి 96.43 పాయింట్లతో ద్వితీయ స్థానం సాధించి రూ.7.5 లక్షల నజరానాను సొంతం చేసుకోగా అనపర్తి ఏరియా ఆసుపత్రి 95.86 పాయింట్లు సాధించి తృతీయ స్థానం సాధించి రూ.5 లక్షల నజరానాను సాధించింది. నజరానాగా వచ్చిన నగదుతో ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఏర్పాటు చేస్తారు.

తృతీయ స్థానం సాధించడం ఆనందంగా ఉంది



కాయకల్ప పథకంలో భాగంగా ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను గుర్తించి నజరానాలు అందించే కార్యక్రమంలో అనపర్తి ఏరియా ఆసుపత్రికి తృతీయ స్థానం లభించడం ఆనందంగా ఉంది. నజరానాగా వచ్చిన రూ.5 లక్షలతో ఆసుపత్రిలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు వెచ్చిస్తాం.

- డాక్టర్ రామగురునాథ్రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, అనపర్తి



నేర సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

ప్రజల్లో విశ్వసనీయత పెంపొందాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహిరంగ మద్యపానం, తాగి వాహనాలు నడపడంపై తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఇష్టానుసారం డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, డయల్ 112కి కాల్ వస్తే తక్షణమే స్పందించి సాధ్యమైనంత త్వరగా బాధితుల వద్దకు చేరుకోవాలని చెప్పారు. సారా, గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అడిషనల్ ఎస్పీలు ఏవీ సుబ్బరాజు, ఎన్‌బీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

తీరు మారని కొందరు

స్టేషన్లలో వైసీపీ వాసనే

ఆ నేతలకు తెరచాటుగా సహాయం

పోలీసు బదిలీల్లో మతలబే కారణం

బదిలీలను పునఃసమీక్షించాలని చర్చ

వారంలో పంపాలని తాజాగా ఉత్తర్వులిచ్చిన ఐజీ

ఇంకా.. పంకా పోలీసే..



'బి క్లియర్. నేను 95 సీఎం అని చెప్పాను. మీకు ఇంకా అర్థం కాలేదు. మర్యాదగ చెబితే మీకు అర్థం కావడం లేదు. అందుకే ఇప్పుడు యాక్షన్‌లోకి వస్తున్నాను. మర్యాద అయిపోయింది. ఇప్పుడు యాక్షన్ కూడా ఉంటుంది. బీ కేర్‌ఫుల్'.. ఓ జిల్లా స్థాయి అధికారికి సీఎం చంద్రబాబు రెండు నెలల కిందట బహిరంగ సభలో ఘాటుగా ఇచ్చిన స్ట్రాంగ్ వార్నింగ్. ఆ ఘటన జరిగి రెండు నెలలు దాటింది. అయినా కొందరు అధికారుల్లో 'గాలి' తీరు మారడం లేదు. ముఖ్యంగా పోలీసుల్లో కొందరు పైకి అధికార పార్టీకి విధేయులుగా నటిస్తూ లోపాయికారిగా వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారనే వాదన బలంగా వినవస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులనే టార్గెట్‌గా చేసుకున్న జగన్.. పోలీసులను వారిపైకి వదిలారు. వైసీపీ పెద్దల వద్ద మార్కులు వేయించుకోడానికి పోలీసులు ఇష్టానుసారం ప్రవర్తించారు. సొంత చట్టాలకు తెరలేపారు. నోరు మెదిపితే కేసు.. కాలు కదిపితే కోటింగ్.. అనే దందాను రక్తికట్టించారు. అయితే.. కూటమి ప్రభుత్వానికి జనం అధికారం కట్టబెట్టినా కొందరు పోలీసులు మాత్రం ఇంకా వైసీపీ పంచన పని చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.





శ్రీకాంత్ విడుదల సందర్భంగా జైలు వద్ద హల్‌చల్..

ప్రభుత్వ వాహనం అని స్టిక్కరింగ్ ఉన్న వాహనంలో శ్రీకాంత్‌ని తీసుకెళ్తున్న విశ్వరూప్ (ఫైల్‌ఫొటో)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని చాలా పోలీస్ స్టేషన్లలో ఇంకా వైసీపీ వాసనే వస్తోంది. జగన్ జమానాలో పోలీసులను రాజకీయ కక్ష సాధింపునకు విపరీతంగా వాడుకొన్న మాట జగమెరిగిన సత్యం. ఆ ఐదేళ్లలో ఠాణాలు సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మారిపోయాయి. పాలకులే గడ్డి కరుస్తుండడం.. అక్రమాలకు వత్తాసు పలకడంతో అధికారుల అమ్యామ్యాల పని సులభంగా అయిపోయేది. వైసీపీ పాలన సమయంలో స్టేషనుకు వెళ్లాలంటే పేదోడికి దడ పుట్టేది. ఎవరికి తమ గోడు వినిపించాలో తెలియక కుమిలిపోయేవాళ్లు. వైసీపీ నేత వద్దకు వెళ్లి కాళ్లావేళ్లా పడితేనే అతడు దయ చూపి పోలీస్ స్టేషనుకు ఫోన్ చేస్తే అప్పుడు ఫిర్యాదు తీసుకునే దారుణమైన పద్ధతి నడిచేది. స్టేషనుకు బాధులుగా ఉండే సీఐ, ఎస్‌ఐలను కావాల్సిన వాళ్లను సీట్లలో కూర్చోబెట్టుకోవడంతో దందాలకు అడ్డూఅదుపూ ఉండేది కాదు. వైసీపీ దుండగులు ఇళ్లల్లోకి వెళ్లి దాడి చేసినా వాళ్లపై కాకుండా బాధితులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొందరు అధికారులు దందాల పంథా మార్చుకోవడం లేదు. అప్పట్లో ఎలాగైతే దందాలు సాగించేవారో ఇప్పుడూ అదే నడుస్తుండడమే వాటికి కారణంగా వినవస్తోంది. వైసీపీ హయాంలో నీలం కండువా నీడలో దాష్టీకాలకు తమ వంతు సహాయం చేసిన పోలీసులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కీలకమైన పోస్టింగులు దక్కించుకున్నారు. ఈ బదిలీల్లో భారీగా డబ్బులు చేతులు మారాయనే విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు జిల్లాలోని కీలకమైన పోలీస్ స్టేషన్ల సీటు దక్కించుకోడానికి సుమారు రూ.15 లక్షల వరకూ రేటు పలికిందని చెబుతున్నారు. అయితే.. ఇక్కడే వైసీపీ తెరచాటు కుట్ర ప్రదర్శించింది. తమకు అనుకూలంగా ఉన్న అధికారులకు వైసీపీ నాయకులే డబ్బులు సమకూర్చి వాళ్ల అనుకున్న సీట్లోకి తెచ్చుకున్నారు. దీంతో తెర పైన కూటమికి విధేయత ప్రదర్శిస్తున్నా.. వైసీపీకి తెరచాటున 'పని' చేసిపెడుతున్నారు. వైసీపీ నాయకులు ఇచ్చే సమాచారంతో టీడీపీ నాయకులను కేసుల్లో ఇరికిస్తున్నారు. గతంలో వైసీపీ నేతలు ఏరికోరి తెచ్చుకున్న అధికారులకు కూటమి ప్రభుత్వంలో కూడా కీలకమైన స్థానాలు దక్కాయి. సీఐలు, ఎస్‌ఐల బదిలీలపై కూటమి పెద్దలు పెద్దగా దృష్టి పెట్టకపోవడంతోనే పరిస్థితి ఇలా మారిందని అటు కూటమి కేడర్‌లోను, ఇటు పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఉదాహరణకు జిల్లాలోని వైసీపీకి పూర్తిగా కొమ్ముకాసే అధికారిగా పేరు బడిన ఓ సీఐ మళ్లీ కీలకమైన స్టేషన్ దక్కించుకున్నారు. మరో ఇలా పలువురు సీఐలు 'కావాల్సిన' సీటు సంపాదించారు. సాధారణంగా గతంలో పనిచేసిన పోలీస్ స్టేషనుకు పోస్టింగ్ ఇవ్వడం జరగదు. కానీ కాసులతో ఆ పనీ జరిగిపోయింది. దీంతో గతంలో వైసీపీ నాయకులు మొదలు పెట్టిన పేకాట బోర్డులు, కోడి పందేలు, బెట్టింగులు వంటి జూదక్రీడలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గంజాయి అమ్మకాలూ కొనసాగుతుండడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

● ఇదిగో తాజా ఘటన

2022 జూన్ 6న జరిగిన దళిత యువకుడు, వలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కొడుకు శ్రీకాంత్‌పై కేసు నమోదైనా రెండేళ్లపాటు పోలీసులకు అరెస్టు చేయాలనే ఆలోచన కూడా రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అరెస్టుకు రంగం సిద్ధం చేశారు. దీంతో శ్రీకాంత్‌ని ఏపీ పోలీసులు తమిళనాడులో అరెస్టు చేశారు. తర్వాత రాష్ట్రానికి తరలించారు. కోర్టు రిమాండు విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అతడికి మంగళవారం(26న) కోర్టు బెయిల్ మంజూరు చేసినా తగిన పత్రాలు జైలుకు సమర్పించడం, తదుపరి ప్రక్రియకు సమయం దాటిపోవడంతో 27న (బుధవారం) సాయంత్రం 6 గంటలకు విడుదల చేశారు. కొడుకును తీసుకెళ్లడానికి విశ్వరూప్ జైలు వద్దకు వచ్చారు. సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు గుమిగూడారు. పెద్ద పెద్ద కేకలు వేస్తూ హల్‌చల్ సృష్టించారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగింది. అయినా పోలీసులు మిన్నకుండిపోయారు. శ్రీకాంత్‌ని విశ్వరూప్ 'ప్రభుత్వ వాహనం' అని స్టిక్కరింగ్ చేసి ఉన్న ఇన్నోవాలో తీసుకెళ్లినా వారించలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తన డ్రైవరును చంపిన కేసులో నిందితుడు, ఆ పార్టీ ఎమ్మెల్సీ అనంతబాబు జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సమయంలోనూ పెద్ద ర్యాలీ నిర్వహించారు. అప్పుడు జగన్ జమానా కాబట్టి పోలీసులూ తమ వంతు సహకారం అందించారు. తర్వాత టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసు (ప్రస్తుత రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే)ను అక్రమ లావాదేవీలంటూ అరెస్టు చేసి జైలుకు పంపారు. వారికి బెయిల్ వచ్చి విడుదలైన సమయంలో టీడీపీ శ్రేణులు జైలు వద్దకు చేరుకోగా పోలీసులు రకరకాల 'రూల్స్'తో ఇబ్బంది పెట్టారు. చివరికి ర్యాలీకి కూడా అనుమతి లేదంటూ అప్పటి డీఎస్పీ విజయ్‌పాల్ (ఈయనపై వైసీపీ డీఎస్పీ అనే ఆరోపణలు బలంగా ఉన్నాయి) నోటీసు ఇచ్చి మరీ అడ్డుకున్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో ఒక వైసీపీ నాయకుడి కొడుకు జైలు నుంచి బెయిల్‌పై విడుదలైతే హల్‌చల్‌ని ఏమాత్రమూ అడ్డుకోలేదంటే.. వైసీపీ పోలీసింగ్ నడుస్తుందనడానికి ఇంతకంటే తాజా ఉదాహరణ ఉండదేమోననే విమర్శలు వస్తున్నాయి. జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ పోలీసుల బదిలీలపై పునఃసమీక్ష చేసి మార్పులు చేస్తేగానీ వైసీపీ వాసన పోదనే వాదన కూటమి వర్గాల నుంచి వినవస్తోంది. నిజాయితీ, నిబద్ధతకు పెద్దపీట వేసే ఉన్నతాధికారిగా పేరున్న ఐజీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

● అప్పుడు పట్టించుకోలేదు

వైసీపీ హయాంలో దాష్టీకాలపై ఎంత గట్టిగా మొత్తుకున్నా అటు జగన్ ప్రభుత్వం, ఇటు పోలీసులు వినబడనట్టు నటించేవారు. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినా ఫలితం ఉండేది కాదు. ఈ క్రమంలో.. జిల్లాలోని శాంతి భద్రతలు అదుపు తప్పడంపై 'అశాంతి అభద్రత' అనే శీర్షికతో గత ఏడాది డిసెంబరు 2న ఓ కథనాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఐజీ అశోక్ కుమార్ అదే నెల 4న ఎస్పీని ఆదేశించారు. కానీ యథావిధిగా దానిని పట్టించుకోలేదు. అయితే ఆ విచారణ రిపోర్టును వారంలో పంపించాలని, ఈ విషయంపై ఎస్పీ స్వయంగా చొరవ చూపాలని ఆదేశిస్తూ ఈనెల 3న బ్లాక్ రిమైండర్ పేరుతో ఐజీ ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వాస్తవాలపై ఎంత అలసత్వం ప్రదర్శించేవారో ఈ ఘటన రుజువు చేస్తోంది.



ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే జరగాలి

మెరుగైన వైద్యంతో రోగుల నమ్మకాన్ని పెంచాలి

లక్ష్యంలో వెనుకబడిన పీహెచ్‌సీలకు షోకాజ్ నోటీసులు

వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డెలివరీలన్నీ ప్రభుత్వాసుపత్రుల్లోనే జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. లక్ష్యసాధనలో వెనుకబడిన పీహెచ్‌సీలను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంతి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, భవన నిర్మాణాలు, సదరం సర్టిఫికెట్లు జారీ, ఎఫ్ఆర్ఎస్ హాజరు, తదితర అంశాలపై మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచాలని, ప్రభుత్వాసుపత్రి పట్ల మరింత గౌరవం పెంచే విధంగా వైద్యులు పనిచేయాలన్నారు. స్నేహపూర్వకమైన వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. ప్రాథమిక, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ఓపీ సేవలు, ల్యాబ్ టెస్టులు, ఐపీ సేవల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే ప్రగతిపై సమీక్షించారు. ప్రతి నెలా జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమం కింద గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్యసేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో నార్మల్ డెలివరీల శాతాన్ని పెంచే విధంగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి వైద్యాధికారి వరకూ ఎఫ్ఆర్ఎస్ హాజరు కచ్చితంగా అమలుచేయాలన్నారు. ఆసుపత్రులకు కావాల్సిన వైద్యపరికరాలు, ఇతర ఎక్విప్‌మెంట్లను హాస్పటల్ అభివృద్ధి సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి పాల్గొన్నారు.



కాటన్ బ్యారేజీ

ఇరిగేషన్ పరిరక్షణపైనే గురి

శాసనసభ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి చర్చ.. స్పందించిన చంద్రబాబు



నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈసారి మన ఎమ్మెల్యేలంతా వివిధ కీలక ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ లేవనెత్తారు. ఒకరితో ఒకరు పోటీపడి స్థానిక సమస్యలు ప్రభుత్వ దృష్టి పడేలా అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయాన్ని బాగా వినియోగించుకున్నారు. ఈ సందర్భంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్యేలు ప్రధాన చర్చనీయాంశం చేశారు. అందులో గోదావరి జలాలపై ఆధారపడిన అన్నదాతల ఇబ్బందులను సభలో చర్చించారు. ముఖ్యంగా శాసనసభ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇరిగేషన్ అంశాలపై జరిగిన చర్చల్లో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కాలువల్లో పూడికతీత పనులు కూడా చేపట్టకపోవడంతో గుర్రపుడెక్కతో కాలువలు పూడుకుపోయాయని అన్నారు. కనీసం లాకుల షెట్టర్లకు గ్రీజులు కూడా పెట్టే పరిస్థితి కూడా లేదన్నారు. అలాగే ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేశారని సభ దృష్టికి తీసుకువచ్చారు. చాగల్నాడు, వెంకటాపురం, పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసి రైతు ప్రయోజనాల పరిరక్షణలో వైసీపీ ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందినట్టు నల్లమిల్లి ఆరోపించారు. ఇదే సందర్భంలో రెండు దశాబ్దాల కిందట గోదావరి కాలువలపై నిర్మాణాలు చేపట్టిన అనేక వంతెనలు అప్రోచ్ రోడ్డులు లేక నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని పూర్తి చేయడం ద్వారా ప్రజలకు ఉపయోగపడతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. మరో రెండు పర్యాయాలు ప్రశ్నోత్తరాల సమయంలో నల్లమిల్లికి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని గోదావరి డెల్టా కాలువల ఆధునికీకరణ అంశాలపై మాట్లాడారు. గోదావరి డెల్టా సిస్టంలో ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో మొత్తం 3670.54 కిలోమీటర్ల మేర పూడిక తీతలు చేపట్టాల్సి ఉందని, అదేవిధంగా ధవళేశ్వరం బ్యారేజీ గత ప్రభుత్వం నిర్వహణలోపం వల్ల ప్రమాదంలో పడిందని.. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకు ఏడు కిలోమీటర్ల పొడవునా 175 ఫ్లడ్ గేట్లు, 22 స్లూయిజ్‌లు 197 ఉన్నాయని, వీటిలో 117 గేట్లు మార్చాలని 2022లో వరల్డ్ బ్యాంక్, సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. దీనికి సీఎం చంద్రబాబు స్పందిస్తూ గోదావరి డెల్టా ఆధునీకరించే ఆలోచన ఉందని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు ఆత్మహత్యాయత్నం - 8లో

మంత్రి దుర్గేష్ కార్యాలయంలో ప్రజాదర్బార్ - 8లో

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 30న శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పథకాలపై మున్సిపల్ చైర్‌పర్సన్ బావనరత్నకుమారి అధ్యక్షతన చర్చించనున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు

రెండు పూటలా తరగతులు

● ఇంటర్మీడియట్ విద్య జోన్ - 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ శారద


జూనియర్ కళాశాలలో తరగతులను పరిశీలిస్తున్న శారద

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈనెల 28వ తేదీ నుంచి రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియట్ విద్య జోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. బుధవారం ఆమె కొవ్వూరు బాలుర జూనియర్ కళాశాలకు విచ్చేశారు. కళాశాలలో నిర్వహిస్తున్న షిఫ్టల విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రస్తుతం షిఫ్ట్ ల విధానంలో విద్యార్థులకు ఉదయం ఇంటర్మీడియట్, మధ్యాహ్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు షిఫ్టల విధానంలో పనిచేస్తున్నాయి. ఈ షిఫ్టల విధానంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు గ్రహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళాశాల సమయం ఉదయం, మధ్యాహ్నం రెండుపూటలా పూర్తిస్థాయిలో ఉండాలని భావించింది. షిఫ్టల విధానాన్ని పరిశీలించిన అనంతరం ఈనెల 28నుంచి ఇంటర్మీడియట్ బోర్డు టైమింగ్స్ ప్రకారం జూనియర్ కళాశాలను రెగ్యులర్ పద్ధతిలో ఉదయం 9గంటల నుంచి సా యంత్రం 4గంటల వరకు కళాశాల తరగతులు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత, ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఆర్‌పీలకు శిక్షణ


వెలుగు సీఆర్‌పీలకు శిక్షణ అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల ఆడిట్‌పై సీఆర్‌పీలకు శిక్షణ అందించినట్లు డీఆర్‌డీఏ పీడీ ఎన్.వి.వి.ఎస్.మూర్తి అన్నారు. కొవ్వూరు మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని 9మండలాలకు చెందిన వెలుగు సీఆర్‌పీలకు గ్రూపుల ఆర్థిక లావాదేవీల నిర్వహణ నిమిత్తం 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు లెక్కలు తేల్చడం శిక్షణ అందించారు. శిక్షణా కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ ఎన్.వి.వి.ఎస్.మూర్తి పరిశీలించి, సూచనలు అందించారు. ఐసీటీఎం ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డీపీఎం ఫైనాన్స్ సంపత్‌కుమార్‌లు శిక్షణ అందించారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల ఆర్థిక నిర్వహణ ఏవిధంగా ఉన్నదో, ఆడిట్ చేయాలన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు సంఘం ఆర్థిక లావాదేవీలు పర్యవేక్షణ చేసి గ్రూపులు లాభాల్లో ఉన్నాయో, నష్టాలలో ఉన్నాయో ఎలా తనిఖీ చేయాలో అనే అంశాలపై శిక్షణను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు వెలుగు ఏపీఎం కె.విజయనిర్మల, డివిజన్‌లోని 9 మండలాల సీఆర్‌పీలు, సీఎల్‌లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంలో ప్రజా దర్బార్


నిడదవోలులో జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అధికార, రాజకీయ నాయకులను కలవాలంటే వారి కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిందే ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికార్లే కాదు సాక్షాత్తూ మంత్రి సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నారు. నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన కందుల దుర్గేష్ ప్రభుత్వంలో ముఖ్యమైన పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బుధవారం నిడదవోలులోని మంత్రి దుర్గేష్ క్యాంపు కార్యాల యంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గణపతి సెంటరులోని ఐలవ్ నిడదవోలు పార్కు ఏర్పాటుకు ముందు ఇళ్లు కోల్పోయిన బాధితులు తమకు ప్రభుత్వం కేటా యించిన స్థలాలను అధికారులు త్వరితగతిన తమకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరగా తక్షణం స్పందించిన దుర్గేష్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

'అవయవదానం చేసేందుకు ముందుకు రండి'


అవయవదాత జీవివి ప్రసాద్‌ను సత్కరిస్తున్న అశోక్, ఎస్ఐ రమేష్

నల్లజర్ల, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇవాంజలిన్ ఆశోక్, ఎస్ఐ రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవయవదానం చేసేందుకు అంగీకరించిన వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి.ప్రసాద్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా అమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇవాంజలిన్ ఆశోక్, ఎస్సై రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో అనేక మందికి ప్రమాదాలు జరిగి అవయవాలు అందక అనేక మంది మృత్యువాత పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీ.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని నల్లజర్లలో 100మంది కిపైగా అవయువ దానం చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు తెల్లం గంగాధర్, మహ్మద్ సిరాజుద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోండి : పీడీజే

● బాల్య వివాహాలు సాంఘిక దురాచారం: కలెక్టర్


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీజేడీ గంధం సునీత, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకునే బాధ్యత సమాజంలోని ప్రతిఒక్కరిపై ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం రాత్రి జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'బాల్యవివాహ ముక్త్ భారత్' కొవ్వొత్తుల ర్యాలీని వారు ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీజే మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమే కాకుండా వయస్సు రాకుండా పెళ్లి చేయడంవల్ల విద్య, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. బాల్య వివాహాల నిరోధంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనిలో భాగంగా అంగన్వాడీ, ఆశ, మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 18ఏళ్లలోపు ఆడపిల్లలు, 21ఏళ్లలోపు మగ పిల్లలకు వివాహం చేస్తే వారిని ప్రోత్సహించిన వారు, సమాచారం తెలిసీ దాచినవారు, పెళ్లి చేసిన వాళ్లు కూడా చిక్కుల్లో పడక తప్పదన్నారు. రెండేళ్ల వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉంటే ప్రభుత్వ అధికారులకు లేదా పారా లీగల్ వలంటీర్లకు సమాచారం ఇవ్వడం బాధ్యతగా భావించాలన్నారు. దేశంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకూడదనే ఉద్దేశంతో 'బాల్య వివాహముక్త్ భారత్' విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు సాంఘిక దురాచారమన్నారు. బాల్యవివాహాలపై ఆయా ఆలయాల బాధ్యులు లేదా సమాచారం ఉన్న వాళ్లు వెంటనే తహశీల్దారు, పోలీస్, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులకు తెలిపితే వెంటనే ఆ వివాహాన్ని నిలిపివేయడం సాధ్యమవుతుందని, వారికి రక్షణ కల్పిస్తామని చెప్పారు. అనంతరం పుష్కర్‌ఘాట్ వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న యువగళం నాయకుడు సత్యేంద్ర

తాళ్లపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రతి కార్యకర్త గౌరవంగా జీవిస్తూ కుటుంబానికి బీమా, భరోసా కలిపిస్తూ పార్టీని నడిపించడంలో ముందుంటున్న ప్రతిఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నానని యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర అన్నారు. బుధవారం సత్యేంద్ర మాట్లాడుతూ తమ నాయకుల ఆదేశాలను అనుసరించి సభ్యత్వాల నమోదుకు శ్రీకారం చుట్టామని అతి తక్కువ కాలంలో గ్రామంలో 1000 సభ్యత్వాలు నమోదు చేశామని అదేవిధంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించే విధంగా ముందుకు సాగుతామని తెలిపారు.

శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న పారిశ్రామికవేత్త వెంకన్న చౌదరి

చాగల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు మండలంలోని మార్కొండపాడుకు చెందిన పారిశ్రామికవేత్త సుంకవల్లి వెంకన్న చౌదరి దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. బుధవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న అనంతం విరాళాలు అందజేసే విభాగానికి వెళ్లి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు డిమాండ్ డ్రాఫ్టు రూపంలో విరాళం అందజేసినట్లు చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామిఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు.

కోటి దీపోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా, స్థానిక గోదావరి గట్టున గల సరస్వతీఘాట్ వద్ద వేలాదిమంది భక్తులు, బుధవారం సాయంత్రం దీపాలు వెలిగించి, కోటిదీపోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



సుందరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి తీరంలోని గోష్పాదక్షేత్రంలో ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి ఆలయాన్ని గోదావరి పుష్కర పనులలో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్‌లు సందర్శించారు. సుందరేశ్వరస్వామికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి, సుందర గణేష్‌లు గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కోరారు. ఆలయ సింహద్వారాన్ని వెడల్పుచేయాలని, ఆలయంలో నూతన టైల్స్ వేయాలని, యాగశాల, వంటశాల నిర్మాణాలు చేపట్టి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ 2027లో జరుగనున్న గోదావరి పుష్కరాలకు చేపట్టనున్న అభివృద్ధి పనులలో సుందరేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసిన ఆలయ అర్చకులు

శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి

● శృంగేరీ జగద్గురు విధుశేఖర భారతీ మహా స్వామి


ప్రసంగిస్తున్న శృంగేరీ జగద్గురు విధుశేఖర భారతీ మహా స్వామి

రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) శ్రేయస్సు కావాలనుకుంటే ధర్మం పాటించాలి. కష్టాలు వద్దనుకుంటే అధర్మాన్ని పరిత్యజించాలి. ధర్మం, అధర్మంతోనే సుఖదుక్కాలు ఉంటాయి. కర్మానుసారం వాటిని అనుభస్తారని శృంగేరీ జగద్గురు విధుశేఖర భారతీ మహా స్వామి ఉద్భోదించారు. స్థానిక శ్రీత్యాగరాజ నారాయణదాస సమితి ప్రాంగణంలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో బుధవారంరాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆధునిక కాలంలో అనేక సౌకర్యాలు పెరిగాయి. విజ్ఞానం పెరిగింది కదా, ఇపుడు కూడా సనాతనధర్మం, అదీ ఇదీ అంటూ అవసరమా అని కొందరు అడుగుతుంటారు. వారికి నేనొకటే చెబుతాను. సౌకర్యాలు, టెక్నాలజీ పెరిగినమాట వాస్తవమే. మహానుభావులు ఎవరో యంత్రాలు కనిపెడితే, చాలా మంది అనుభవిస్తున్నారు. అయినా ప్రపంచంలో దుఃఖం అనేది తగ్గిందా, వేరే మార్గాలలో దుఃఖం వస్తుంది. సుఖమూ ఉందని ఆయన అన్నారు. గతంలో లేని రోగాలు, మనకు పేరు కూడా తెలియని రోగాలు కూడా వింటున్నామన్నారు. సౌకర్యాలవల్ల దుఃఖం నివారించినా, మరో రూపంలో వస్తుందని స్పష్టం విశదీకరించారు. దేవుడిచ్చిన మేరకు, కష్టపడి సంపాదించుకుని అనుభవించాలి. సంపాదించి అనుభవించకపోతే ఉపయోగంలేదు. అదే సమయంలోధర్మ పాలనా ఉండాలని బోధించారు. ఇవి రెండూ జరిగితేనే హాయిగా ఉంటుందన్నారు. మనిషికి ధర్మమార్గం అత్యంత ఆదర్శం. సనాతన ధర్మం గొప్ప తనాన్ని అందరూ తెలుసుకోవాలి. ప్రతీ విషయం వెనుక ఓ కారణం కచ్చితంగా ఉంటుంది. అన్నీ అర్థం చేసుకునే సామర్థ్యం మనకు లేకపోవచ్చు. పూర్వమే రుషులు వాటి సారాన్ని మనకు అందించారని ఆయన వివరించారు. ప్రతీ మనిషికి జిజ్ఞాస ఉండాలని, వితండ వాదన మంచిది కాదన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాలంకరణ



నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రం లో బుధవారం సాయంత్రం దీపాలం కరణ నిర్వహించారు. శివలింగ ఆకృతిలో పూలను అలంకరించి దీపాలు వెలిగించారు. ఈ దీపాలంకరణలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాలలో పురోగతి సాధించాలి'


కార్తీక వన సమారాధనలో పాల్గొన్న దృశ్యం

నల్లజర్ల, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా, ఆర్థికం గా, విద్యాపరంగా విశ్వబ్రాహ్మణులు పురోగతి సాధించాలని అందుకు సంఘ సభ్యులంతా సమిష్టి కృషిచేయాలని ఆ సంఘ మండలశాఖ అధ్యక్షుడు లక్కోజు రామాచార్యులు అన్నారు. బుధవారం దూబచర్లలో కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ ఐక్యత లేకపోవడంవల్ల సామాజికంగా ఎదగలేకపోతున్నామన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామికి, కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు, పిల్లలకు వివిధ క్రీడలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పారేపల్లి మురళీకృష్ణ, మంచి సత్యనారాయణ, రాయలవరపు నాగ సతీష్, మంచి యుగంధర్, లక్కోజు దుర్గారావు, రాయలవరపు వీరాచారి పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి

సీఎం సహాయనిధి ఆపన్నహస్తం

●గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రాజు


బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయస్థితిలో ఉన్న ప్రతీఒక్కరికీ సీఎం సహాయనిధి ఆపన్నహస్తం లాంటిదని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఆయా కారణాలతో అనారోగ్యం బారీనపడిన ఆయా గ్రామాలకు చెందిన వారికి సుమారు రూ.6లక్షల 14వేల 32లు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన బుధవారం పంపిణీ చేశారు. వాదాలకుంట గ్రామానికి చెందిన కొడమంచిలి సోమయ్య 70,300 గుడ్డిగూడెం గ్రామానికి చెందిన సుంకర శ్రీహరికి రూ.2,17,380, భీమోలు గ్రామానికి చెందిన వేములూరి రామా రావు రూ.45,000లు, దొప్పసాని శ్రీను రూ.25,166లు జగన్నాధపురం గ్రామానికి చెందిన ఇల్లిన సత్యనారాయణ రూ.1,06, 800లు కరగాపాడు గ్రామానికి చెందిన పంది వెంకటలక్ష్మి రూ.25,656లు, అదేగ్రామానికి చెందిన కోణాల శ్రీను రూ.లక్షా23,730లు చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ సీఎం సహాయనిధి ఊసే ఎత్తలేదన్నారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న ప్రజల ప్రాణాలతో జగన్ చెలగాటం ఆడారని ఆరోపించారు. నేటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక గోపాలపురం నియోజక వర్గంలోని ప్రాణపాయస్థితిలో ఉన్న ఎంతో మందికి రూ.కోటికి పైబడి సీఎం సహాయనిధి అందించామన్నారు. అనారోగ్యం బారీనపడి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నపేదలకు సీఎం సహాయనిధి సంజీవనిలాంటిదన్నారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారా యణ, టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, గద్దే హరిబాబు, గన్నిన మురళీ, ప్రధాన కార్యదర్శి వడ్లమూడి రమేష్, జ్యేష్ట శ్రీధర్, జ్యేష్ట శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కూనపం ప్రసాద్ బాబు, గన్న మని చిట్టిబాబు, భీమోలు గ్రామ కమిటీ అధ్యక్షుడు దాకారపు అప్పారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన వెంట ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో

ముగ్గురు ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలోని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచనం రేపింది. ప్రకాశ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికానగర్‌లో సాయిశుభా అపార్ట్‌మెంట్ ఎస్3 ఫ్లాట్‌లో పాతూరి ఉపేంద్రకుమార్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. కొద్దినెలల క్రితం ఎస్వీ రెస్టారెంట్ పేరుతో అదే ప్రాంతంలో ఓ హోటల్ ప్రారంభించారు. పెట్టుబడి, నిర్వహణ కోసం సుమారు రూ.40లక్షలు అప్పు చేశారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో.. అప్పులు తీర్చలేమనే మనస్తాపం చెందారు. దీంతో కుటుంబ యజమాని పాతూరు ఉపేంద్రకుమార్, భార్య లక్ష్మీవిజయ, కుమారుడు సంతోశ్ బుధవారం ఉదయం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు తాగామని బాధితులు చెబుతున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాళ్లను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదం తప్పిందని, సురక్షితంగా ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆత్మహత్యాయత్నం కావడంతో ఎలాంటి కేసూ నమోదు కాలేదు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన 17 సంవత్సరాల బాలికపై పట్టణానికి చెందిన యువకుడు అత్యాచారం చేశాడని బాలికతల్లి బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భర్త, అత్తమామలపై కట్నం వేధింపుల కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన నెక్కలపూడి శిరీష, దేవరపల్లికి చెందిన సత్యనారాయణలు 2013లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి బాబు పుట్టాడు. కొంతకాలం తరువాత అధిక కట్నం తీసుకురావాలని భర్త సత్యనారాయణ, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారని శిరీష పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

● రూ.రెండు లక్షల ఆస్తి నష్టం


ఎండ్యాలలో అగ్నికి ఆహుతి అయిన పూరిల్లు

నిడదవోలు, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలు మండలం పెండ్యాల గ్రామంలో బుధవారం వీరమళ్ళ వీరవేణి అనే మహిళ పూరిల్లు ప్రమాదవశాత్తూ అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు సకాలం లో స్పందించి మంటలను అదుపుచేసి గ్యాస్ సిలెండర్ బయటకు తేవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

సీనియర్ నాయకుడు జక్కంశెట్టి మృతి



పెరవలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెరవలికి చెందిన టీడీపీ నాయకుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈయన కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సీఆర్ పార్టీల్లో పనిచేశారు. రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడిగా తణుకు వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడిగా, కల్లుగీత కార్మిక సంఘం స్టేట్ డైరెక్టర్‌గా బాధ్యత నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మంచి గుర్తింపు పొందారు. ఈయన మృతికి పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్, కాంగ్రెస్‌ఖ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరిగెల అరుణకు మారి, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు రవివర్మ, బొడ్డు రామాంజనేయులు, ఆగర్తి కృష్ణారావు, పలువురు సంతాపం వ్యక్తం చేశారు.